# అభ్యుదయ

ఆగస్టు 1977

60 పైసలు



ముచ్చటైన

తెలుగు పుస్తకాల

ముద్రణకు

అభ్యుదయ

K Saradamba

ప్రారంభ సంచికకు

# అభినందనలు

శ్రీ వెంకటేశ్వర ప్రింటర్స్,

14, న్యూ పెన్షనర్స్ లేన్, మద్రాసు-600 021

ఫోన్: 3 9 2 2 2

ఆంధ్ర ప్రదేశ్
అభ్యుదయ రచయితల
సంఘం మద్రాసు
శాఖ పత్రిక

విడి ప్రతి:
60 పైసలు

సాలు చందా:
ఏడు రూపాయలు

సెప్టెంబర్ సంచికలో:
అడవి బాపిరాజు
'నారయణ రావు';
జ్యూలియస్ ఫ్యూజిక్,
విశాలాంధ్ర ప్రచురణాలయం
నవలల పోటీలో
బహుమతి పొందిన
మూడు నవలలు;
ఆగస్టు సమావేశంలో
చదివిన కవితలు;
యింకా కథలు,
వ్యాసాలూ తదితర
సాహిత్య రచనలు.

అడ్వర్టైజ్‌మెంటు రేట్లు

| | |
|---|---|
| మొదటి పేజి | రు. 150 |
| లోపలి పేజి | రు. 100 |
| లోపలి అర పేజి | రు. 75 |
| అట్ట చివర పేజి | రు. 250 |
| 2, 3 అట్ట పేజీలకు | రు. 200 |

ఒక సంవత్సరంలో వాడుకునే 12 పేజీలకు అట్టపేజీలకు 15 శాతం డిస్కౌంట్.

# అభ్యుదయ

సంచిక 1 ఆగస్టు 1977 సంపుటి 1

'అభ్యుదయ' ను సమగ్రమైన పత్రికగా మార్చాలన్న చిరకాల వాంఛ ఫలించింది. పధ్నాలుగు మాసాలుగా బులిటిన్ రూపంలో వస్తున్న అభ్యుదయ, అవాంతరాలెన్నిటినో అధిగమించి, 30వ స్వాతంత్ర్య దినోత్సవ శుభ మాసంలో సమగ్రమైన మాస పత్రికగా మొదలవుతున్నది. అయితే, దీనికి నేడు వ్యాపార పత్రికలకు అలవాటైన ఆడంబరాలు వుండవు: గిరాకీని పెంచుకొనే తాపత్రయాలూ వుండవు.

1976 జూన్‌లో 8 పేజీలతో మొదలై, నాలుగేసి పేజీల చొప్పున పెంచుకుంటూ యిప్పటికి మూడు రెట్లు చెయ్యడం నిర్వాహకులకు తలకుమించిన! పనయ్యింది. అయినా - వాగ్దానం కాదు గానీ, ఈ సంవత్సరాంతానికి పుటలు యింకా పెంచాలన్న ఆలోచన వుంది. నాణ్యం, ప్రమాణాలూ పెంచాలన్న గట్టి సంకల్పమూ వుంది.

ఆసరాలూ, సాధనాలూ లేకుండా, ఐచ్ఛిక సేవగా పత్రికను తీసుక రావడం తేలిక పని కాదు. అనేక విధాలుగా అందిన ప్రోత్సాహ, ప్రోద్బలాలు నిర్వాహకుల బరువును తగ్గించడానికి సాయపడ్డాయి. ఇవి ఇకమీదట యింకా ఎక్కువగా అందగలవన్న నమ్మకమూ వుంది మాకు.

సాహిత్యం, కళలు, సంస్కృతి, సంఘ జీవనాలను ప్రతిబించించే పత్రిక 'అభ్యుదయ'. ఇది పాఠకుల పత్రిక మాత్రమే కాదు; రచయితల పత్రిక కూడా.

ముప్ఫయ్యేళ్ళ క్రితం వచ్చిన స్వాతంత్ర్యానికే యింకా పరిపూర్ణత రాలేదు; రాహుకేతువులు రానివ్వడం లేదు. దేశం చీకటిమయం అవడం యిందువల్లనే. స్వాతంత్ర్యానికి సాఫల్యం కలగకపోవడం యిందువల్లనే. సమాజ మనోమాలిన్యాలన్నీ సాహిత్యంలో, సాహిత్యకారులలో చోటు చేసుకుంటూ వున్నాయి. తిరోగతి పెడదారుల నుండి సాహిత్యాన్ని సన్మార్గంలో ప్రవేశపెట్టడం అభ్యుదయ కాముకు లందరి కర్తవ్యం. ఇది 'అభ్యుదయ' విధి.

# రచన, రచయిత వ్యక్తిత్వం

రచయిత భావాలు, విశ్వాసాలు, తాత్విక దృష్టి అన్నీ కలియగా అతని వ్యక్తిత్వం ఏర్పడుతుంది. ఈ వ్యక్తిత్వం అతని రచనల్లో వెల్లడయి తీరాలా అనే ప్రశ్నకు సమాధానం చెప్పవలసి వచ్చినప్పుడు, అపరాధ పరిశోధక నవలలూ, సెక్సు నవలలూ వంటి కాలక్షేపపు సాహిత్యంలో తప్ప లక్ష్యశుద్ధితో కూడిన సాహిత్య రచనలన్నిటిలోనూ రచయిత వ్యక్తిత్వం వద్దనుకున్నా వెల్లడవుతుంది. "మతమును, సంఘమును, నాచారమును మనోహరముగా చెప్పునదియే వాఙ్మయము'' అని చెప్పిన కీ॥ శే॥ విశ్వనాధ సత్యనారాయణ గారు తన విశ్వాసాన్ని తన రచనల్లో స్పష్టం చేశారు. అలాగే గోపీచంద్‌లో మారుతూ వచ్చిన తాత్వికదృష్టి ''అసమర్థుని జీవయాత్ర" నుండి, ''పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా'' వరకూ ఆయన రచనల్లో వెల్లడయింది.

డికెన్స్. థాకరీ, బ్రాంటిస్, గాస్కెల్, ప్రతిభావంతులైన యీ 19వ శతాబ్దపు ఆంగ్లేయ వాస్తవికతావాద రచయితల రచనలు ''వృత్తిరీత్యా రాజకీయవాదులు, వ్యాసకర్తలు నీతులను ప్రవచించే ప్రచారకులు అందరూ కలసి చెప్పినదానికంటె ఎక్కువగానే రాజకీయ, సాంఘిక సత్యాలను లోకానికి అందించా''యని కారల్ మార్క్స్ అన్నారు.

జీవితాన్ని ఉన్నదున్నట్టుగా వ్రాయాలి గాని, దాన్ని రచయిత వ్యాఖ్యానించకూడదని ఒక వాదన వుంది. మొపాసాకు గురువైన ఫ్లాబర్ట్ యీ విషయమై యిలా అన్నాడు: ''ప్రతికళ శాస్త్రబద్ధమై వుండాలి, కాని వ్యక్తిగతంగా వుండకూడదు. పాత్రల తత్వంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించాలి కాని రచయిత వాటిని తనలాగ తయారుచేయకూడదు.'' మొపాసా తన గురువుగారి నిర్వచనాన్ని విశదీకరిస్తూ ''ఏ ఒక్క పేజీలో గాని, మాటలో గాని రచయిత స్వంత అభిప్రాయాలూ ఉద్దేశాలూ వుండకూడదు" అన్నాడు.

అయితే ఫ్రెడ్రిక్ షిల్లర్ "మానవుని కళాత్మక విద్యను గురించిన లేఖలు'' అనే గ్రంథంలో కళను రెండు తరగతులుగా విభజించాడు—ఒకటి వాస్తవాన్ని యథాతథంగా ప్రతిబింబించేదీ, యింకొకటి కళాకారుని భావాలను వ్యక్తం చేసేదీ అని అన్నాడు.

కాని యీ రెండు తరగతుల మధ్య వ్యత్యాసం వెంట్రుకవాసి మాత్రమే. ఎందుకంటేరచయిత భావాలు అతని చుట్టూ వున్న వాస్తవికతకు ప్రతిబింబాలు—అవి వాస్తవికతలోంచి ఉద్భవించేవే. కాబట్టి రచయిత వెల్లడించే భావాలు వాస్తవికతనే వెల్లడిస్తాయన్న మాట. అందుకనే ప్రఖ్యాత రచయిత గోథె రచయిత వ్యక్తిత్వం, అతని అభిప్రాయాల ధోరణీ అతని రచనల్లో వద్దనుకున్నా వెల్లడయి తీరుతాయనీ, కాని అంత మాత్రాన రచయిత తన భావాలను స్పష్టంగా వెల్లడించడానికి ప్రయత్నం మానుకోకూడదనీ అన్నాడు.

వాస్తవిక చిత్రణ అంటే కేవలం వాస్తవాన్ని యథాతథంగా కాపీ చేయడం కాదనీ, ఒక యుగంలో వుండే స్థితిగతుల సారాంశాన్ని లోతుకు తరచి చూసే పద్ధతి అనీ, ఆ యుగంలో సర్వసాధారణంగా వుండే లక్షణాలను కళాత్మకంగా సాధారణీకరించి వ్యక్తం

చేసే ధోరణి అనీ మార్క్స్, ఎంగెల్స్ పేర్కొన్నారు.

కాబట్టి వాస్తవికతను వెల్లడి చేసేటప్పుడు రచయిత దృక్పథం వ్యక్తమవుతుంది.

ఒకసారి టాల్‌స్టాయ్ ప్రఖ్యాత చిత్రకారుడు ఇల్యా రెపిన్ స్టూడియో వెళ్లేరు. మొపాసా కథల సంపుటికి పీఠిక వ్రాస్తూ టాల్‌స్టాయ్, ఇల్యా రెపిన్‌తో తాను జరిపిన సంభాషణను పేర్కొంటూ ఇలా వ్రాశారు:

''తాను వేసిన దేవుడి ఊరేగింపు చిత్రాన్ని ఆ ప్రఖ్యాత చిత్రకారుడు నాకు చూపించాడు. ఆయన దానిని చాల అద్భుతంగా చిత్రించాడు. కాని తాను చిత్రించిన విషయాన్ని గురించి చిత్రకారుని దృక్పథ మేమిటో అందులో కనబడలేదు.

''సరే, యీ మతాచారాలన్నీ మంచివేనని నీ అభిప్రాయమా? ఇలాంటి ఆచారాలు పాటించాలా, అక్కరలేదా?'' అని నే నడిగాను. ''నా వెర్రిబాగులతనానికి నవ్వుకొని ఆ చిత్రకారుడు తన కా ప్రశ్నకు సమాధానం తెలియదనీ, తెలుసుకోవలసిన అవసరం లేదనీ, జీవితాన్ని చిత్రీకరించడమే తన ధ్యేయ''మనీ అన్నాడు.

''పోనీ, నీకీ తంతు అంటే ఇష్టమేనా?''

''ఇష్టమని చెప్పలేను.''

''అంటే యీ ఆచారాలంటే నీ కసహ్యమా?''

''ఇష్టమూ లేదు, ద్వేషమూ లేదు.''

తాను చిత్రించిన జీవితంలోని విశేషాన్ని అర్థం చేసుకోకుండా, తాను చిత్రించిన దానిని ప్రేమించకుండా, లేదా ద్వేషించకుండా జీవితాన్ని చిత్రించిన సంస్కారపరుడైన యీ ఆధునిక చిత్రకారుడు నా తెలివితక్కువకు చిరునవ్వు నవ్వేడు.''

ఈ సంభాషణ జరిగిన తరవాత తాను అనేక విషయాలను గురించి పునరాలోచించా



నసీ, తన దృక్పథం విస్తృతమూ సుస్పష్టమూ అయిందనీ ఒక చోట రెపిన్ వ్రాసుకున్నాడు. తత్ఫలితంగా రెపిన్ చిత్రించిన ''కుర్‌స్క్ ప్రాంతంలో పాస్కల్ ఊరేగింపు'' (ఈస్టర్ పండుగకు ముందు జరిగే తంతు) అనే ప్రఖ్యాత చిత్రం వెలువడింది.

ప్రసిద్ధ రచయితలంతా తమ అభిప్రాయాలను స్పష్టంచేసిన వారే. ఉదాహరణకు ప్రఖ్యాత రష్యన్ రచయిత గొగోల్ వ్రాసిన 'ఓవర్ కోట్' అనే పెద్ద కథలో ఒక పేద ప్రభుత్వోద్యోగి కథను అతని సహ ఉద్యోగి చెప్పినట్టు మన కళ్ళ ముందు, చిత్రం వేసినట్టుగా ఎంతో చక్కగా, కొంత వ్యంగ్యంగా వర్ణించాడు, మధ్యలో వ్యంగ్యం వదలి, ఎంతో సానుభూతితో రచయిత చెప్తున్నట్టుగా యిలా వ్రాశాడు: ''ఆ పేద యువకుడు తన రెండు చేతులతో మొహం కప్పుకుని మనిషిలో ఎంత అమానుషత్వం వుందో చూడడానికి భయపడ్డాడు.''

కాబట్టి ఒక సాహిత్య రచనను విలువ కట్టేటప్పుడు, అందులోని విషయాన్ని, ఇతివృత్తాన్నీ చూడడమే కాకుండా రచయిత మన హృదయాన్ని, మెదడునూ ఎంతవరకు స్పృశించాడో కూడా చూడాలి. అంటే కళాత్మక రచనలో రెండు ప్రధానాంశాలుంటాయి: రచయిత తీసుకున్న వస్తువూ, అతని వ్యక్తిత్వం. అయితే పాఠకుల ముందు జీవితాన్ని గురించి న్యాయ న్యాయాల విచారణ చెయ్యదలచుకున్నప్పుడు రచయిత చాల బాధ్యతతో వ్యవహరించవలసి వుంటుంది. అంటే జీవితాన్ని వాస్తవికంగా చిత్రించడం విషయంలోనూ, దానిమీద తను వ్యాఖ్యానించడం విషయంలోనూ కూడా బాధ్యతగా వ్యవహరించాలి. రచయిత తానెంచుకున్న ఇతివృత్తం దగ్గరనుంచి చిన్నచిన్న వివరా

లను వర్ణించడం వరకూ రచనలోని ప్రతి విషయంమీద ప్రతిభావంతుడైన రచయిత తన వ్యక్తిత్వపు ముద్రవేసి వదిలిపెడతాడు.

రచయిత మరీ వ్యక్తిగత ధోరణిలో వెళ్తే వాస్తవికత దెబ్బతింటుందనీ, జీవితాన్ని యథాతథంగా చిత్రించలేకపోవచ్చుననీ వాదించవచ్చును. దీనికి లెనిన్ యిలా సమాధాన మిచ్చారు. "వరసగా కొన్ని వాస్తవిక విషయాలను వర్ణించవలసివచ్చినప్పుడు, వాస్తవాన్ని ఉన్నదున్నట్టు చిత్రించే కళాకారుడు యీ వాస్తవిక విషయాలను సమర్థించే ప్రమాదంలో పడతాడు. అదే భౌతికవాది అయినట్లతే, వర్గ వైరుధ్యాలను వెల్లడిచేసి, అలా చెయ్యడంలో తన అభిప్రాయాన్ని తెలియజేస్తాడు...."

లెనిన్, టాల్‌స్టాయ్‌ని రష్యన్ విప్లవానికి అద్దం వంటి వాడనడానికి కారణం ఆయన రష్యన్ రైతాంగ విప్లవం యొక్క (1905 నాటిది) ప్రత్యేక లక్షణాలను వర్ణించడంవల్ల మాత్రమే కాదు. రష్యన్ విప్లవ సార్వత్రిక ప్రాముఖ్యాన్ని కళాకారుడుగా, తత్వవేత్తగా ప్రతిబింబించడంలోనే అతని ఖ్యాతీ, ప్రాధాన్యమూ యిమిడివున్నాయని లెనిన్ వ్రాశాడు.

కాబట్టి రచయిత (కళాకారుడు కూడా) జీవితం పట్ల ఒక సుస్పష్టమైన దృక్పథానికి ప్రతినిధిగా, ఒక ప్రత్యేక వ్యక్తిగా అతను సృష్టించిన పాత్రలతోబాటు, అతని రచనల ద్వారా బయటపడతాడు. అతను తన చుట్టూ వున్న జీవితాన్ని లోతుగా తరచి చూసి, ఎంత శక్తివంతంగా ప్రతిబింబించ గలిగితే, అతని ప్రతిభా సామర్థ్యాలు, ఉద్వేగపూరితమైన వ్యక్తీకరణ ఎంత పటుతరంగా వుంటే, అంత స్పష్టంగా అతని వ్యక్తిత్వం అతని రచనలో బయటపడుతుంది.

(బొ. సూ.)

# 'మాలపల్లి'

(ఒక పరిశీలన)

టి. ఎల్. నరసింహారావు

**1920** దశకంలో మన జాతీయోద్యమ పరిణామ క్రమంలో ఉత్పన్నమైన అనేక కొత్త, పాత భావాల మధ్య సంఘర్షణ, వాటి సమ్మేళన, సంఘ సంస్కరణ, తెలుగు దేశ సామాజిక జీవితంపై ఆనాటి రాజకీయోద్యమ ప్రభావం—వీటన్నిటికీ అద్దంపట్టిన మొట్టమొదటి కాల్పనిక రచన, ఉన్నవ లక్ష్మీనారాయణగారు 1921 లో జైలులో రాసిన మాలపల్లి నవల. అప్పుడప్పుడే దేశంలో వ్యాపించుతూ వున్న సోషలిస్టు భావాలను కూడా ఈ నవల ప్రతిబింబించింది—ప్రతిబింబించటమే కాదు, వాటిని చొప్పించి, జాతీయోద్యమానికి ఒక కొత్త విషయపుష్టి కల్పించ ప్రయత్నించింది కూడా.

గుంటూరు జిల్లా మంగళాపురం గ్రామానికి చెందిన ఒక మాలదాసరి కుటుంబం చుట్టూ రచయిత ఈ కథ నల్లుకొచ్చారు, ఇది పేద రైతు కుటుంబం. ఇంటిల్లిపాది ఒళ్ళువంచి పనిచేస్తూ, వున్నంతలో సుఖంగా, తృప్తిగా జీవిస్తుంటారు.

వీరు రామానుజ మతస్థులు కుటుంబ పెద్ద రామదాసూ, పెద్దకొడుకు వెంకటదాసూ పరమ సాత్వికులు. వారు సొంత వ్యవసాయం చేసుకొంటూ వుంటారు. రెండవ కొడుకు సంగదాసు గ్రామ భూస్వామి చౌదరయ్య అనే అతడి దగ్గర నిగామానుగా పని చేస్తూంటాడు, కాని కార్మిక పక్షపాతి; పంచమోద్యమ కార్యకర్త: భూస్వాముల దోపిడీ అత్యాచారాలను సాత్విక పద్ధతుల్లో ప్రతిఘటిస్తూ వుంటాడు. వారికి సదాచారాలు

బోధిస్తూ, వారిని సంఘటిత పరచి అప్పు డప్పుడు సమ్మెలు కట్టిస్తుంటాడు కూడా.

రామదాసు, అంతగానూ సాత్వికురాలైన అతని భార్య మహాలక్ష్మి, కుటుంబ సంస్కారాన్నిబట్టి చిన్నతనంలోనే ధార్మిక చింతన అలవడినవారి కూతురు జ్యోతీ, కాపడానికి గొడ్లు కాసే జీతగాడే అయినా ఆచరణలో రామదాసు కుటుంబ సభ్యుడుగా మారిపోయిన అప్పాదాసు అనే ఒక కుర్రాడూ ఈ కుటుంబంలోని మిగతా వారు.

భూస్వామి చౌదరయ్య చిన్న కొడుకు రామానాయుడు కూడా వేదాంతి. సంగదాసూ, యితడూ సన్నిహిత మిత్రులు. ఇతడు తండ్రి కన్నుగప్పి సంగదాసుతో కలిసి పంచమోద్యమంలో తిరుగుతుంటాడు.

సంగదాసు వల్లనే తన కొడుకు చెడిపోయాడని చౌదరయ్య అభిప్రాయం. ఇదీ, కూలీలను రెచ్చగొట్టి సమ్మెలు చేయిస్తున్నాడనే కక్ష మనసులో పెట్టుకొని చౌదరయ్య ఒకసారి ఆవేశంలో సంగదాసు తల పగుల గొట్టి చంపేస్తాడు. రామదాసు కుటుంబం మీద వ్యాజ్యాలు తెచ్చి, వాళ్ళకున్న చేరెడు చెక్కావాల్చేసుకొని వాళ్ళకు నిలువ నీడలేకుండా చేస్తాడు.

భూస్వామి చేతుల్లో దేవుడిలాంటి తన తమ్ముడి చావూ, తోటి కులస్థుల దుర్భర జీవితాలూ, ఎంతో సాత్వికుడైన వెంకటదాసులో పైశాచిక తిరుగుబాటు భావాలను పురిగొల్పుతాయి; దైవద్వేషిగా మార్చుతాయి. నిస్సహాయులను ఆదుకోలేని భగవంతుడు ఒకడున్నా, లేకపోయినా ఒకటేనని వాదించ నారంభిస్తాడు. కలియుగ ధర్మానికి (అధర్మానికి) ప్రతినిధులైన "లోభుల" (అంటే ధనికుల) అధికారాన్ని అంతం చేసి "కృతయుగ ధర్మాన్ని" పునరుద్ధరించటమే ఈ దుర్వ్యవస్థకు విరుగుడని సిద్ధాంతం చేస్తాడు. నల్లమల అడవుల్లోకి పారిపోయి, తక్కెళ్ళ జగ్గడనే పేరు పెట్టుకొని పేదలను కూడగట్టి వారికి తన కృతయుగ ధర్మాలు బోధిస్తూ, "తిరుమంగయాళ్వార్ కైంకర్యం" (ధనికుల యిండ్లు దోచి పేదలకు సొమ్ము పంచే "ధర్మకన్నాల" ఉద్యమం) ఆరంభిస్తాడు.

రామదాసు కుటుంబమంతటినీ ప్రభుత్వం సి. టి. యాక్టు (నేరస్థ జాతుల చట్టం) కింద సెటిల్మెంటులో నిర్బంధిస్తుంది. ఆ తరువాత చట్ట ధిక్కారణ నేరమేదో మోపి జైల్లో పెడుతుంది. ప్రలోభాలకు లోబడి మతం మార్చుకొని క్రైస్తవ మిషనరీల ప్రాపకంలో బ్రతికే ఒక సెటిల్మెంటు ఉద్యోగి అత్యాచారానికి బలై, జ్యోతీ, అప్పాదాసూ కృష్ణానదిలో దూకి ఆత్మార్పణ గావించుకొంటారు. జగ్గడు (వెంకటదాసు) సర్కారు సైన్యంతో జరిగిన ఒక పోరాటంలో తీవ్రంగా గాయపడి, బందీగా చిక్కి, శిక్ష పొంది నిడదవోలు జైలులో తల్లిదండ్రుల సమక్షంలోనే కన్నుమూస్తాడు. మహాలక్ష్మి కూడా గుండె పగిలి చనిపోతుంది. ఆ కుటుంబంలో చివరకు రామదాసు ఒక్కడే మిగులుతాడు. స్వరాజ్య అవతరణతో (1921 సహాయ నిరాకరణోద్యమ పర్యవసానంగా స్వరాజ్యం వచ్చినట్లు ఈ నవలలో రచయిత చిత్రించారు) అతడు జైలు నుంచి విడుదలవుతాడు.

భూస్వామి మరణానంతరం అతడి యిద్దరు కొడుకులు తమ ఆస్తిపాస్తులన్నిటినీ పంచమోద్యమానికి అర్పించి జాతీయోద్యమంలో చేరిపోతారు.

సంగదాసు పోయినప్పుడు అతడి స్మృతి చిహ్నంగా అతడి అభిమానులు మంగళాపురంలో స్థాపించిన సంగ మందిరం అనే చిన్న హరిజన పాఠశాల జాతీయోద్యమాభి

మానుల సాయంతోనూ, జగ్గడి ఉద్యమం తాలూకు నిధులతోనూ ఒక పెద్ద హరిజన విద్యాపీఠంగా వృద్ధిలోకి వస్తుంది.

క్లుప్తంలో యిదీ ఈ నవల్లోని కథ.

1921 లో గాంధీజీ నాయకత్వాన సాగిన సహాయ నిరాకరణోద్యమం భారత జాతీయోద్యమ పరిణామంలో ఒక ప్రధానమైన మలుపు. జాతీయ స్వాతంత్ర్య సందేశం మొట్టమొదటిసారి గ్రామాలవరకు వ్యాపించిందీ, సమాజంలోని అట్టడుగు తరగతులను సైతం స్పృశించిందీ అప్పుడే. అన్ని తరగతుల వారూ వందలు, వేల సంఖ్యలో విదేశీ పాలనతో సహాయ నిరాకరణ జరిపి జైళ్ళకు పోవటమే గాదు, పంచమోద్ధరణ, మద్యపాన నిషేధం, ఖాదీ ప్రచారంలాంటి నిర్మాణాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. అనేకమంది తమ ఆస్తి పాస్తులన్నిటినీ ఉద్యమానికి అర్పించారు. ఆ నాటి జాతీయోద్యమం ప్రదీప్తం చేసిన త్యాగ, దేశభక్తి భావాలను రచయిత ఈ నవలలో సాకారంగా మనముందు నిలిపారు.

కుల కట్టుబాట్లు సడలటం మన దేశంలో పెట్టుబడిదారీవిధా నావిర్భావంతోనే మొదలైనప్పటికీ, 1921 నాటి జాతీయోద్యమ వెల్లువ ఈ క్రమాన్ని మరింత లోతుకు తీసుకు వెళ్ళింది. ఈ నవలలో రచయిత వర్ణించిన విజయవాడ పంచమోద్ధరణ సభలో, పంచములతోబాటు ఒక శాస్త్రులవారితో సహా అగ్రవర్ణాల వారు అనేకమంది పాల్గొనటం, సంగదాసూ, రామానాయుడు రైలుస్టేషన్‌లో సహపంక్తి భోజనం చేయటం, రామదాసు తన గురుతుల్యుడుగా భావించే బుచ్చయ్య శాస్త్రులు గారు ఏదో వేదాంత గ్రంథంకోసం వెతుక్కొంటూ సరాసరి మాలపల్లికే వెళ్ళటం, యింకా యిలాంటి అనేక చిన్న చిన్న ఉదంతాలు ఈ పరిణామాన్ని సూచిస్తున్నవి.

ఇదే విధంగా పంచముల, వ్యవసాయ కూలీల దీనస్థితి, బ్రిటిష్ పాలకులు నిమ్న జాతుల ప్రజలకు నేరస్థజాతులనే పేరు తగిలించి, వారిని సెటిల్మెంట్లలో నిర్బంధించి, బానిస చాకిరీ చేయించటం, మత ప్రచారంపేరిట క్రైస్తవ మిషనరీల ఆగడాలు, జైళ్ళలోని అమానుష పరిస్థితులు, కోర్టుల, ప్రభుత్వ కార్యాలయాల తీరుతెన్నులు—యిలాంటి సమకాలీన సమస్యలెన్నిటినో రచయిత ఈ నవలలో, కథ నడకకు మధ్యమధ్య తీవ్ర అంతరాయమేర్పడినా పట్టించుకోకుండా విపులంగా వర్ణించారు.

అయితే, ఆనాటి స్థితిగతులను ఒక పెద్ద నవల రూపంలో కళాత్మకంగా చిత్రించి జాతీయోద్యమ ప్రబోధంగావించేందుకు రచయిత చేసిన ప్రయత్నమంతా ఒక ఎత్తూ, అప్పటికి లభ్యమవుతున్న అరకొర సమాచారాన్నే ఆధారం చేసుకొని, రష్యా విప్లవాన్నీ, సోషలిస్టు భావాలనూ ప్రచారం చేయడం ద్వారా, జాతీయోద్యమానికి ఒక కొత్త స్ఫూర్తి కల్పించేదుకు రచయిత చేసిన ప్రయత్నం మరొకఎత్తూనని చెప్పక తప్పదు.

బెజవాడ సభలో, సభాధ్యక్షుడు వెంకటరెడ్డి అనే ఆయన ఉపన్యాసరూపంలో రచయిత సోవియట్ల వ్యవస్థను, రష్యా విప్లవాన్ని వర్ణించారు.

సంగదాసు. వెంకటదాసు మధ్య తాత్విక చర్చల్లోనూ, వెంకటదాసు జైల్‌లో తన అంతిమ క్షణాల్లో తన తండ్రితో చెప్పిన మాటల్లోనూ, యింకా మరికొన్ని చోట్లా, రచయిత నాస్తికవాద భావాలను ప్రతిపాదించి, మూఢ మత విశ్వాసాలను నిశితంగా హేళన చేసి హేతువాద భావాలను ప్రచారం చేశారు.

తక్కెళ్ళ జగ్గని ధర్మ బోధలు అనే పేరిట రచయిత శాస్త్రీయ సోషలిజం మూల సిద్ధాంతాలను స్థూలంగా తెలియ పరచారు. వీటిని "కృతయుగ ధర్మం" అని ఆయన పిలవటం ఈ నాడు మనకు కొంత విడ్డూరంగా కనిపించవచ్చు. వాటిని అడ్డం పెట్టుకొని పునరుద్ధరణ భావాలను (Revivalism) ఆయన ప్రచారం చేశాడనీ అనిపించవచ్చు (అది పూర్తిగా కాదనలేము—పునరుద్ధరణ భావాలకు ప్రతీక అయిన రామదాసు పాత్ర రచయితకు ఈ నవలలో ప్రధాన అభిమాన పాత్ర కావటమూ, ఈ నవలకు ఆయన "సంగ విజయం" అని కూడా పేరు పెట్టడమూ యిందుకు నిదర్శనాలు). కాని ఆనాడు సోషలిజాన్ని గురించి రాసిన, ఉదార జాతీయ వాదులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, దిగవల్లి వెంకట శివరావు, ముట్నూరి కృష్ణారావు వంటి వారుకూడా వాటిని "కృత యుగ" ధర్మం అనే పేరిటే వ్యవహరించిన సంగతి గమనార్హం. వారూ, ఈ నవలా రచయితా కూడా, ఈ కొత్త భావాలను ప్రజలకు పరిచితమైన భాషలో అందజేసేందుకు ఈ పరిభాషను వుపయోగించారనిపిస్తుంది.

ఈ భావాలను ప్రచారం చేసే వుద్దేశంతో రచయిత ఈ నవలలో చేర్చిన బుర్ర కథ, ఆంధ్ర దేశంలో సోషలిస్టు భావాలను ప్రబోధించిన గేయ సాహిత్యానికి నాంది. "ఆది కాలమున అందరు నరులు, అన్న దమ్ములండీ" అంటూ ప్రారంభించిన ఈ గేయం ఆదిమ సమాజంలో ప్రయివేటు ఆస్తి, వర్గ వ్యత్యాసాలు, మనిషి మనిషిని దోచుకోవటం—యివేవీ లేని వర్గరహిత సమాజాన్ని వర్ణిస్తుంది. ఆ తరువాత వర్గ సమాజంలో పేదల పాట్లు వర్ణించి, చివరకు, "కూలికి విలువ కలదని మీరు గుట్టు తెలుసుకోండి............ పనివారందరు ఏకమైతిరా ప్రపంచమే మీది, శ్రేణులు కట్టి, సమ్మె కట్టితే చెల్లును మీ మాట" అంటూ శ్రామికులకు సంఘశక్తిని ప్రబోధిస్తుంది.

లక్ష్మీనారాయణ గారు ఒక స్పష్టమైన ప్రయోజనాన్ని మనసులో పెట్టుకొని ఈ నవల రాశారు. పేద ప్రజలు సంఘటితం కాకపోతే, స్వరాజ్యం వచ్చినా, అది మళ్ళీ ధనస్వామ్యమే అవుతుంది తప్ప, ప్రజాస్వామ్యం కాబోదన్న తన అభిప్రాయాన్ని ఈ నవలలో ఒక చోట ఆయన చాలా స్పష్టంగానే చెప్పారు.

ఆయన ప్రకటించిన కొన్ని అభిప్రాయాలు అశాస్త్రీయంగా వున్నవనీ, ఆయన అవగాహనలు అసమగ్రమనీ ఈనాడు మనకు అనిపిస్తే అనిపించవచ్చు. అయినప్పటికీ ఆయన జాతీయోద్యమానికి ఒక కొత్త దృక్పథం కల్పించాలనే లక్ష్యంతో ఈ రచన చేశారు. ఆ ప్రయత్నంలో కృతకృత్యులయారు. దాదాపు ఒక దశాబ్దం తరువాత ఈ భావాలు మన తెలుగు దేశంలో ఒక శక్తివంతమైన కార్మిక, సోషలిస్టు ఉద్యమాన్ని ఆవిర్భవింప జేశాయి.

**కథానిక** # "దానం"*

## డాక్టర్ ఎ. విజయలక్ష్మి

"డాక్టరమ్మ గారు!" ప్రిస్క్రిప్షన్ వ్రాస్తున్న డాక్టర్ శారద తలెత్తింది.

"నువ్వా? బాగా చదువుతున్నావా బాబూ?" ఆదరంగా పలుకరించిం దతన్ని. చిన్నగా తలూపా డతను. డ్రాయర్ తీసి ఐదు రూపాయల నోటొకటి అతని చేతిలో పెట్టింది శారద. మాటలకందని ఏదోభావం అతని కళ్ళల్లో కదలాడుతూవుండగా చేతులు జోడించి సెలవు తీసుకున్నాడు. అనుకోకుండా శారదకు అతను మొదటిసారి తనను కలుసుకోవడం గుర్తొచ్చింది.

తను ఇంటర్మీడియట్ చదువుతున్నానని, తల్లీ తండ్రి తనని చదివించగల స్థితిలో లేరని, కొంతమంది ధర్మాత్ముల దయవల్ల తను చదువుకోగలుగుతున్నానని చెప్పి, తనను తోచిన సహాయం చెయ్యమన్నాడు. ఇలాంటి ఘరానా బిచ్చగాళ్ళ తెలివితేటలకు లొంగిపోయి డబ్బిచ్చేసేంత పిచ్చిది కాదు తను. వీడిని తెలివిగా వదిలించుకోవా లనుకుంది శారద. అంతలోనే మరో ఆలోచన కూడ వచ్చి ఆమెను ఒక్కక్షణం ఆగేలా చేసింది. ఇతను నిజంగా చదువుమీద ఆసక్తి వుండి కూడ డబ్బు లేకపోవడంవల్ల చదువుకోలేక పోతున్నాడేమో, ఇలాటివాళ్ళకు తను చెయ్యగలిగిన సహాయం చెయ్యడం తన ధర్మం కాదా! ఇంకా పసితనం వదలని యితని ముఖం ఒకరి ముందు చెయ్యి చాచవలసి వచ్చిందనే కించతో, నిస్సహాయతతో జాలి గొలిపేలా వుంది.

పాపం! ఎన్ని కష్టాలుపడి చదువుకుంటున్నాడో! ఎన్ని అవమానాలను దిగమ్రింగుకుంటున్నాడో!....కాని యిది నటనేమో, తనని నమ్మించడాని కిలా దీనంగా పెట్టాడేమో ముఖం!....ఛ! ఛ! సాటి వ్యక్తిని గురించి ఎంత హీనంగా ఆలోచిస్తూంది తను! డబ్బిస్తే యిస్తుంది, లేకపోతే లేదు. అంతే గాని అతని నిజాయితీని శంకించడానికి, అతనిని దగాకోరుగా, నీచంగా చిత్రించడానికీ ఏం అధికారంవుంది తనకు?

"చూడు బాబూ! నువ్వు అబద్ధాలు చెప్తున్నావని అనను కాని నువ్వు నిజమే చెప్తున్నావనడానికి ఆధారం కనపడడం లేదు. అంచేత మీ ప్రిన్సిపాల్‌గారితో నువ్వు పేద విద్యార్థివని ఒక్కముక్క కాగితం మీద వ్రాయించుకొచ్చావంటే, యీ ఒక్కసారి కాదు, నీ చదువయిపోయేంత వరకు నెలకు అయిదు రూపాయల చొప్పున యిస్తాను. అతను సంతోష సంభ్రమాలతో నమస్కరిస్తూ 'థేంక్స్' చెప్పి, ఆ సాయంకాలమే ప్రిన్సిపాల్ లెటర్ తీసుకొచ్చాడు.

అదంతా గుర్తుకొచ్చింది శారదకు. అప్పుడప్పుడు చదువుకుంటున్నాం, సహాయం చెయ్యమనో, పిల్ల పెళ్ళికి సాయం చెయ్యమనో, బ్రతికి చెడినవాళ్ళం, కుటుంబమంతా నాలుగు రోజుల్నుంచీ పస్తుంది, తమకు తోచిన ధర్మం చెయ్యమనో, వస్తూవుంటారు. వీళ్ళల్లో ఎవరికివ్వాలో, ఎవరికివ్వగూడదో సందిగ్ధంగానే వుంటుంది శారదకు. తనిచ్చేది అపాత్రదానం కాకూడదని శారద కోరిక. అదే సమయంలో నిజంగా అవసరంలో వున్న వారిని తను నిరాశపరచ కూడదని, ఎంత స్వల్పంగానైనా సరే వారికి సహాయపడగలితేనే తన చదువుకు, సంపాదనకు సార్థకత అని అనుకుంటుంది. కాని

---

* పై కథ, యీ సంచికలోని కథలు 'అబల', 'చిల్ల పెంకులు' జూన్ సభలో చదివినవి.

యిలా యివ్వడం తన తెలివితక్కువగా, బలహీనతగా భావించి ఎవరూ తనని మోసం చెయ్యకుండా జాగ్రత్తగా వుండాలని అనుకుంటుంది—తను యిలా యితరులకు సహాయపడాలని కోరుకోవడం కీర్తి కాంక్షతో కాదు గదా అనే ఆత్మవిమర్శ కూడ చేసుకుంటూ వుంటుంది. ఈ ఊగిసలాటలో కొంత మందిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసి, కొంత మంది చెప్పేది మౌనంగా విని, అప్పటికెలా తోస్తే అలా చేస్తూ వుంటుంది. ఇదంతా జ్ఞాపకం చేసుకుని చిత్రమైన తన మనస్థితిని తలచుకుని చిన్నగా నవ్వుకుంది శారద.

చూడవలసిన పేషెంట్స్ ఎవరూ లేక పోవడంవల్ల మెడికల్ జర్నల్ చేతిలోకి తీసుకుంది. ఇంతలో ఒక నడివయసాయన లోపలికొచ్చి నమస్కరించాడు. 'కూర్చోండి' అంటూ తన కెదురుగావున్న కుర్చీ చూపించిందతనికి. ఇంట్లో ఆడవారి ఆరోగ్యం గురించి తన సలహా అడగడాని కొచ్చి వుంటాడని భావిస్తూ, 'చెప్పండి' అన్నట్లుగా అతనివంక చూచింది. అప్పటివరకు పది మడతలు పెట్టివున్న అరఠావు కాగితాన్ని విప్పి దాన్ని సరిచేసి శారదముందు పెట్టాడు. తన ముందున్న కాగితం మీదున్న పద్యాల్ని ఉత్కంఠతతో చదవడం మొదలు పెట్టింది శారద. తన గుణగణాల్ని, కీర్తి ప్రతిష్ఠల్ని, డాక్టరుగా తన శక్తి సామర్థ్యాల్ని అందమైన భాషలో భట్రాజులా పొగిడాడు ఆ పద్యాలలో. చివరి పద్యం కూడ చదివేసరికి ఏదో తెలియని అవస్థలో పడిపోయింది శారద.

"అమ్మా! పిల్ల పెళ్ళి చేయాలి. ఏదో తమకు తోచిన సాయం" అంటూనే వున్నాడతను. శారద మరో ఆలోచన లేకుండా వెంటనే డ్రాయర్ తెరిచి పది రూపాయల నోటు అతని చేతిలోపెట్టడం, అతను దీవిస్తూ బయటకు వెళ్ళిపోవడం, ఒక్క-క్షణంలో జరిగి పోయాయి.

మరుక్షణం తెలివితెచ్చుకున్న శారద, జరిగింది గుర్తుకు తెచ్చుకుని, ఆత్మన్యూనతతో కుంచించుకుపోతూ, శిలాప్రతిమలా కూర్చుండి పోయింది.

## స్థిర లక్ష్యం

డాక్టర్ దాశరథి

తూర్పు తలుపులు తెరచుకోనీ!
మార్పు గాడ్పులు పరచుకోనీ!
ఎందుకీ శిథిలావనీ గా
ఢాంధకార వినద్ధ రజని?

బ్రతుకు జాడల మహారణ్యములు,
ప్రయాణములో గడచె దినములు;
నడచి నడచి పదాలు కందెను,
నయనములు జ్వాలదగ్ని కణములు

నిదురనే రుచి చూడకుంటివి
కదలుటయె నా ధ్యేయమంటివి
ఎంతదూరము వెళ్ళినను వి
భ్రాంత శూన్య పథమ్మె కంటివి

ఎంతకని ఈ పశ్చిమాశా
ధ్వాంత కాంతారాభిలాష?
ప్రాగ్దిశాంచల పంచలత్ ప్రా
భాతమనగా ఏల "ఘోషా"?

ముసుగుపై విసుగైన రాదా?
పొద్దు కాంచను మనసు లేదా?
సూర్యముఖివై తిరుగు! ఔషస
తూర్య రుతి వినిపించబోదా?

గమ్యమొక దిశ, గమన మొక దిశ
గడవదా తుదిలేని ఈ నిశ?
సాగిపో! స్థిర లక్ష్యముంటే
సమీపములో కలదు శుభ దశ!

# కేరళ ప్రజాకవి
# వాయలార్ రామవర్మ

కేరళ ప్రజా కవి వాయలార్ రామవర్మ విప్లవ గీతాలు మత మౌఢ్యం మీద, ఛాందస సంప్రదాయాల మీద, సామాజిక దోపిడీ మీద సంధించిన శిలీముఖాలు. శ్రామికవర్గ పక్షపాతిగా మానవతావాదానికి అంకితమైన మహాకవి రామవర్మ.

1975 అక్టోబరు 27వ తేదీన, 47 సంవత్సరాల వయసులో ఆయన ఈ లోకం వదిలే నాటికి ఆయన వారసత్వంగా కేరళ ప్రజానీకానికి సంక్రమించిన ఆస్తి ఎనిమిది కవితా సంకలనాలు; దాదాపు మూడు వేల సినిమా పాటలు. ఆయన మృతి చెందాడన్న వార్త కేరళ ప్రజానీకానికే గాక, అభ్యుదయ కవితా జగత్తుకే దిగ్భ్రమ కలిగించింది. ఆయన చనిపోయిన తిరువనంతపురం నుండి ఆయన స్వగ్రామం వాయలార్‌కు దాదాపు వందమైళ్ళ దూరం సాగిన అంతిమ యాత్రలో శోకసంతప్తులై వేలాది ప్రజలు పాల్గొనడమే ప్రజాహృదయాల్లో ఆ మహా కవికిగల ప్రత్యేక స్థానానికి ప్రత్యక్ష తార్కాణం.

1948-1950 మధ్యకాలంలో కేరళలో జరిగిన సాంఘిక-రాజకీయ ఉద్యమాలు మలయాళంలో అనేక మంది కవులను సృష్టించాయి. ఛాందస క్షత్రియ కుటుంబంలో జన్మించిన రామవర్మ ఈ ప్రజా పోరాటాల ప్రభావంతోనే సాహితీ అగ్నిపర్వతంలా సామాజిక రంగంలో ప్రజ్వలించాడు. తన జంధ్యాన్ని తెంపి వేసుకొని, పిలకను ఉత్తరించుకొని ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ మీద, మత దురాచారాల మీద, సాంఘిక అత్యాచారాల మీద కవితా పరశువును సంధించాడు. "జపమాల-జందెం" అన్న తన గీతంతో పురోహితులనూ, ఆచారపరాయణులనూ ఇలా హెచ్చరిస్తాడు:

"ఇదుగో! వచ్చాం మేం!

జంధ్యాల నుండీ, జపమాలల నుండీ
విముక్తమైన ప్రాణులం!
మేం నవయుగానికి వేగుజుక్కలం!
నవ సంస్కృతికి వైతాళికులం!
మా బాట నుండి దూరంగా వైదొలగండి!
మేం అశ్వమేధం పూర్తి చెయ్యాలి."

రామవర్మ మేధావుల కోసం, కవుల కోసం, సాహితీవేత్తల కోసం కవిత రాయలేదు. కార్మిక, కర్షకుల కోసం, ఏమీలేని నిరుపేదల కోసం కలం పట్టాడు. వారి బాధామయ గాథలను వారి కట్టెదుట పరిచాడు. ఈ విధంగా ఆయన కవితలు శ్రామికవర్గానికి చైతన్య గీతిక లయ్యాయి.

ఆయన కవితా సంకలనాలు "వెదురు పొద" (1955), "ఆయిషా" (1952), "ఒక జూడాస్ మళ్ళీ పుట్టాడు" (1955), "నాకు చావులేదు" (1955), ఇంకా అనేక గీతాలలో సామాన్యుల వీరోచిత ఆత్మార్పణ, వారి ధైర్యసాహసాలూ, కష్టనష్టాలూ, వాంఛలూ ప్రతిఫలించాయి.

ఆయన కవితలలోని అందరినీ ఆకట్టుకునే శయ్యా సారళ్యం, అసాధారణమైన నిష్కాపట్యం, భావోద్విగ్నతా ఆయనను ప్రజా కవిని చేశాయి. ఒక పేద ముస్లిం బాలిక బాధామయ గాథను చిత్రీకరించే 'ఆయిషా' కావ్య అవతారికలో "వేదన నిండిన వ్యవస్థ నుండి, నేను త్రవ్వితీశా నీ కథను" అని చెపుతాడు.

ప్రజలకు అర్థంకాని రీతిలో రసానందం కోసమే కవిత రాయాలనే పండిత కవుల మీద ఆయనకు ఏమాత్రం గౌరవం లేదు. అందుకే:

"ఘరానా కవులారా! మీరు అలిసి పోలేదా?
పేజీలకు పేజీల్లో శూన్యాన్ని నింపడంతో?
మరుసటి ఉదయానికే మాడి పొయ్యే
పద్మాల సొబగులను తీర్చిదిద్దడంతో
మీ చేతులు నొప్పెట్టడం లేదా?
దేశ నిర్మాతలు మీరే అయితే
కవిత ముఖం మీద ఉమ్మేతాను''
....అంటూ కోపిస్తాడు.

కళ ప్రజల కోసం, కవిత ప్రజల కోసం అన్నదే ఆయన మార్గదర్శక సూత్రం. మానవుల జీవితమే ఆయన కవితకు ప్రాణం, ప్రణవం. 'అలవైకుంఠపురమ్ములో ఆ మూల సౌధమ్ములో' ప్రజలను మరచి కునికే దేవుణ్ణి రామవర్మ ఎన్నడూ ఖాతరు చేయడు. మానవ సమస్యలను చిత్రించని సాహిత్యమేదీ అతనికి సమ్మతం గాదు. అందుకే—

''బాధాపరితప్తమైన మానవాత్మను
ప్రేమించలేని యెట్టి వేదాంతాన్నీ
నే నెన్నడూ ప్రేమించను''—అంటాడు

'మానిషాద' అన్న కావ్యంలో.

మానవుడే సర్వ చరాచర ప్రపంచానికి శాసనకర్త అని రామవర్మ విశ్వాసం. మానవుడు దేవుణ్ణే సృష్టించగల శక్తిమంతుడు, నక్షత్రాలను, అంతరిక్షాన్నీ పాదాక్రాంతం చేసుకోగల దిట్ట, అని ఆయన నమ్మకం.

''నేను తపస్సు చేస్తూ వుండగా
నన్ను చూడడానికి వచ్చాడు దేవుడు
ప్రగాఢమైన ఆగ్రహంతో
నన్ను స్వర్గం నుండి తోలుకెళ్ళను!!
సర్వశక్తి సమన్వితుడైన ఈ మానవాకృతి
ముందు దేవుడు అదృశ్యమయ్యాడు,
మూఢ నమ్మకాలు పటాపంచల
య్యాయి''.

అలాగే 'నాకు చావు లేదు' అన్న గీతంలో మానవుణ్ణి సర్వశక్తివంతుడుగా, అజరామర శక్తిగా, నిఖిల విశ్వాన్నే శాసించగల ధీశాలిగా అభివర్ణిస్తాడు:

''మానవుడు దిఙ్మండల భిత్తికపై నిలువ
గలడు
గిరగిర తిరిగే విశ్వాన్నే శాసించను''
అని అంటూ,

కమ్యూనిజంలో అచంచల విశ్వాసంతో, శాస్త్రీయ సామ్యవాద వాస్తవికతతో, పీడిత, తాడిత మహాప్రజల కోసం తన కలాన్ని అంకితం చేసి, గళాన్ని విప్పిన ప్రజా కవి వాయలార్ రామవర్మ, ప్రపంచ అభ్యుదయ సాహితీ చరిత్రలో అజరామరంగా నిలుస్తాడు.

(శ్రీకాంత్)

## పాలెస్తీనా సమర కవిత

మేమిక్కడే వున్నది
మా ఆశయాన్ని
పులియు బారించడానికి
గడ్డ కట్టిన నరాలలో
నిప్పుసెగల గుండెలలో
మేముంటాం మిక్కడే
దాహం తీర్చుకుంటాము
రాతిని పిండి
ఆకలి చల్లార్చుకుంటాం
ధూళితో
మడమ తిప్పేది లేదు
(తౌఫిక్ జయద్)

కాలరాయబడిన
మీ ఆశల నుండి
శిలువ వేయబడిన
మీ పెరుగుదల నుండి
అపహరింపబడిన
మీ చిరునవ్వుల నుండి
మీ పిల్లల చిరునవ్వుల
నుండి
విధ్వంసం నుండి
ఘోర హింసల నుండి
నెత్తురు మరకల
గోడల నుండి
చావు/బతుకుల
గొణుగుళ్ల నుండి
వెలుస్తుంది జీవితం
ఓ మహా దేశమా
ఓ పెనుగాయమా
ప్రేమబంధమా
(ఫద్వా తఖన్)

# * నజ్రుల్ ఇస్లామ్ *

## పురిపండా అప్పలస్వామి

హావిల్‌దార్ కాజీ నజ్రుల్ ఇస్లామ్ గొప్ప విప్లవ కవి. ఎంతటి కవో, అంతటి సంగీత విశారదుడు. అతడి కవితలో సాహిత్యమూ, సంగీతమూ పెనవేసుకుంటాయి. అగ్గి పాటలతో విప్లవ నృత్యాలు చేస్తాయి.

నజ్రుల్ ఇస్లామ్ ఒక కావ్య సంపుటి పేరు "అగ్ని వీణ." దాని అట్టమీది చిత్రం ఎర్రటి అగ్గి వీణ. దాని తీగెల మీద రేగే పాటలు ఆకుపచ్చ మంటలు.

'అగ్ని వీణ'లో ఒక గేయం "విద్రోహీ."

ఇది మొదట ఏభై ఏళ్ళ క్రితం 1927 లో "ముస్లిమ్ భారతి" అన్న బెంగాలీ మాస పత్రికలో వెలువడింది. దాని సెగకి బెంగాలంతా కుత కుత లాడిపోయింది. నజ్రుల్ కొత్త కంఠానికి నివాళిపట్టి రవీంద్రనాథ్ ఠాకూర్ తన నాటకం "వసంత" అతడికి అంకిత మిచ్చాడు.

నజ్రుల్ ఇస్లామ్ ప్రభావం దేశంలో కొత్త కవులందరి మీదా ఇంతో అంతో పడింది; తెలుగు యువతరం మీద కూడా.

"విద్రోహీ" 138 పాదాల పెద్ద గేయం. 'అగ్నివీణ' నించి దీని తొలి చరణాలు కొన్ని తెలుగుచేసి బెంగాలీ మూలంతో సహా 'అభ్యుదయ' పాఠకులకు అందిస్తున్నాను.

## బెంగాలీ మూలం

బౌలో బీరో—
ఉన్నొతొ మొమొ శిరొ!
నేహారి ఆమారి, నొతొ-శిరొ ఓయి
శిఖొరొ హిమాద్రిరొ!
బొలో బీరో—
బొరొ మొహాబిశ్వేర్ మొహాకాశొ ఫాడి
చొంద్రొ సూర్య్యొ గ్రొహొ తారా ఛాడి
భూలోకొ ద్యులోకొ గోలోకొ భేదియా,
ఖోదారొ ఆసొనొ 'ఆరొశొ' ఛేదియా
ఉఠియాఛి చిరొ-బిస్మొయొ ఆమి
బిశ్వొ-బిధాత్రీరొ,
లొలాటే రుద్రొ భొగొబానొ జ్వొలె
రాజొ-రాజొ టీకొ దీప్తొ జొయొశ్రీరొ!
బొలో బీరో—
చిరొ-ఉన్నొతొ శిరొ!
ఆమి చిరొదుర్దొమొ, దుర్బినీతొ,
నృశొంసొ,
మొహా-ప్రొలొయేర్ ఆమి నొటొరాజొ,
ఆమి సాయిక్లోన్, ఆమి ధ్వొంసొ,
మొహాభొయొ, ఆమి ఒభిశాపొ
పృథ్వీరొ!

## తెనిగింపు

అను వీరుడా—
అను ఉన్నతం నా శిరం!
నాది చూసి తల ఒంచుకుంది
ఆ హిమాద్రి శిఖరం!
అను వీరుడా—
అను మహా విశ్వమహాకాశం చీల్చి,
చంద్ర సూర్య గ్రహతారకలు విడిచి,
భూలోక ద్యులోక గోలోకాలు భేదించి,
దేవుడి సింహాసనం ఛేదించి
లేచాను, విశ్వవిధాత్రి
చిరవిస్మయం నేను!
లలాటాన వెలుగుతున్న
రుద్రభగవానుడు
దీప్తజయశ్రీ రాజరాజ తిలకం!
అను వీరుడా—
నేను చిర ఉన్నత శిరస్కుణ్ణి!
చిర దుర్దముణ్ణి నేను, దుర్వినీతుణ్ణి,
నృశంసుణ్ణి,
మహాప్రళయ నటరాజుని,
నేను సాయిక్లోన్, నేను ధ్వంసం,
మహాభయం నేను, భూమి అభిశాపాన్ని

# పత్రికలు - రచయితలు

పత్రికలకి నేడు ఓ విశిష్ట స్థానం వుంది తెలుగు ప్రజలలో. అలాగే కొద్దో గొప్పో రచయితలకి కూడా ఓ ప్రత్యేక స్థానం వుంది పాఠకులలో.

కాని దురదృష్టవశాత్తూ, పత్రికలకి రచయిత అంటే వుండే గౌరవం తక్కువ. ఈ విషయం చాలా మంది రచయితలు అనేక సందర్భాలలో గుర్తించే వుంటారు. పత్రికా సంపాదకులు అనేక మంది రచయితలని చిన్న చూపు చూడటం, రచయితలకి, ముఖ్యంగా కొత్తగా వ్రాస్తున్న రచయితలనేక మందికి తప్పనిసరి అయింది. అనేక విషయాలలో రచయితలని పత్రికలు ఎంత మాత్రం ఖాతరు చేయటం లేదు.

మొదటి విషయం పారితోషికం.

కథ వేసుకొన్న తర్వాత ఆ కథా రచయితకి, పారితోషికం పంపే పత్రికలు తక్కువ. అయితే గత సంవత్సరంలో, పారితోషికం పంపని అనేక పత్రికలు డబ్బు పంపటం ప్రారంభించాయి ఎందువల్లో.

కొన్ని పత్రికలు నిర్దిష్టంగా పారితోషికం ఎంత పంపాలో, ఎప్పుడు పంపాలో రూల్స్ ఏర్పరచుకొని ఆ ప్రకారం పంపుతున్నాయి. కొన్ని పత్రికలు—ముఖ్యంగా మాస పత్రికలు (కొత్త) రచయిత కథ ప్రచురించటమే వారికి చేసే వుపకారంగా పరిగణించి రెమ్యునరేషన్ పంపటం లేదు.

కథలకి రెమ్యునరేషన్ పంపే కొద్ది పత్రికలు ఎంతో స్వల్పంగా పంపుతాయి. రూ. 15 నుంచి 5 లోపు. కానీ ఒక మాస పత్రిక రావటంవల్ల తెలుగు రచయితలకి మేలు జరిగిందని చెప్పొచ్చు. విధిగా మిగతా మాస పత్రికలు కూడా రెమ్యునరేషన్ పెంచటం, బహుమతులు ప్రకటించడం, దాని రెమ్యునరేషన్ సిస్టమ్ వల్లేనని ఘంటాపథంగా చెప్పొచ్చు.

పారితోషికం ఎంత అన్నది ప్రశ్నకాదు. ఎంతో కొంత రచయితకి అందితే అది మానసికంగా తృప్తినిచ్చి, ఇంకో కొత్త కథ వ్రాయడానికి ప్రేరేపించొచ్చు.

రెండో విషయం కథల పరిశీలన.

ఓ పద్ధతిప్రకారం, వచ్చిన కథలని పరిశీలించే పత్రికలు అరుదనే చెప్పొచ్చు. కథని పోస్ట్ చేసాక రచయిత ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తాడు. కనీసం మూడు నెలలలో నయినా కథ త్రిప్పి పంపడమో, అంగీకారం తెలియచేయడమో సంపాదకుల విధిగా పేర్కొనడంలో తప్పులేదు.

కొన్ని పత్రికలు—ముఖ్యంగా ఓ వార పత్రిక, దాదాపు మాస పత్రికలన్నీ, ఇంటిమేషన్ లేకుండా ప్రచురిస్తారు. పారితోషికం పుచ్చుకునేటప్పుడు కన్నా, కథ అంగీకరింపబడిందని తెలుపుతూ వచ్చే వుత్తరం రచయితకి ఎంతో ఆనందాన్నిస్తుంది. పదిహేను పైసల పోస్ట్‌కార్డ్ మీద ప్రింట్ చేసిన వాక్యాల నడుమ అంగీకరింపబడ్డ కథ పేరు వ్రాసి, రచయిత చిరునామా వ్రాయడం శ్రమతో కూడుకొన్న పని కాదు. 'గుమాస్తాలు లేరని' ఓ సంపాదకుడంటే, 'తీరిక లేదు' అని ఓ సంపాదకుడు అన్నాడు.

ఆ కథ అతీగతీ తెలియక ఒకసారి నెలల తరబడే గాక, సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది రచయిత. (నిజంగా సంవత్సరాల తరబడే).

పాఠకులెవరయినా రచయిత పేరు వ్రాసి,

కేరాఫ్ ఆ రచయిత కథ పడ్డ పత్రిక సంపాదకులకి పంపితే అది చెత్త బుట్ట చేరుతుంది. రచయితకీ, పాఠకుడికీ మధ్య వారధి పత్రిక. పత్రిక బాధ్యత అలాంటి వుత్తరాలు రచయితకి రీ డైరెక్ట్ చేయటం. ఒకొసారి చక్కటి సద్విమర్శలున్న వుత్తరాలు కూడా చెత్త బుట్టలో చేరుతుంటాయి.

కథ ప్రచురింపబడ్డ సంచికని రచయితకి పంపటం కనీస మర్యాద. అలా పంపేటప్పుడు అది రచయితకి చేరాలనే వుద్దేశంతో [illegible]

చుట్టూ ఓ బ్రవున్ కాగితం పీలిక చుట్టి, చిరునామా వ్రాసి. అది మధ్యలో ఆర్.ఎమ్.ఎస్. లోనో, ఎక్కడో ఓ చోట పరహస్తగతమవుతుంది. అనేక హస్తాలు దాటుకొని రచయిత చేతికి చేరటం అరుదయిన అనుభవం.

ఓ కవరులో పెట్టి పంపితే చేరొచ్చు, లోపల ఏంవుందో తెలియదు కాబట్టి. అదే పోస్టేజ్‌తో, రికార్డెడ్ డెలివరీలో పంపితే ఇంకో అర్ధరూపాయి ఎక్కువ ఖర్చవుతుందంతే. అక్కడ పొదుపు చూపిస్తారు పత్రికల వాళ్ళు.

కొన్ని పత్రికలు—ముఖ్యంగా పెద్ద వార పత్రికలు తాము తెలుగు సాహితీ ప్రపంచంలో రాజులమనుకుంటాయి. అందరి రచనలూ సమానంగా ప్రచురించవవి. కొందరు రచయితల కథలు ఎంత మంచివి పంపినా తిప్పి పంపుతాయి, ఎట్టి కారణం లేకుండా. ఎందుకో ఆ సంపాదకులకే తెలియని అనవసరపు ఈ 'బ్లాక్ లిస్టింగ్'.

పత్రికలు అమ్మేది తెల్ల కాగితాల పుస్తకాలు కావు. కథలు, కవితలు, వ్యాసాలు, వివిధ శీర్షికలు వీటితో నింపుతాయి పత్రికని. అవి వ్రాసే రచయితకి పై కనీస మర్యాదలు చూపటం ఏనాటికైనా పత్రికలకీ [illegible]

ఆంగ్ల పత్రికలలాగా కథ పంపిన నెల రోజుల్లో (అంగీకరించే పక్షంలో) అంగీకార లేఖ, చెక్‌లతో, ప్రచురింపబడే సంచిక వివరాలతో వుత్తరం పంపలేకపోయినా (1) అసలు కథ వేసుకుంటారా, లేదా, (2) వేసుకుంటే ఆ సంగతి తెలియచేయటం, లేదా ఎక్కువ వ్యవధి తీసుకోకుండా త్రిప్పి పంపటం, (3) పారితోషికం వాళ్ళు ఇవ్వగలిగినంత వీలయినంత త్వరలో పంపటం, (4) పత్రికని రికార్డెడ్ డెలివరీ ద్వారా పంపటం లాంటి ప్రాథమిక ప్రిన్సిపుల్స్‌కి కట్టుబడాలని కోరుకుందాం.

(మూర్తి)

*మహా మేధావి*

తను ఎక్క కూర్చున్న
కొమ్మను
నరుక్కున్న
కాళిదాసు
మహా మూర్ఖుడు.
ఎదుటివాడో!
ప్రక్కవాడో!
మరి
ఎవడో ఒకడు
ఎక్క కూర్చున్న
కొమ్మను
నరికేవాడు
మహా మేధావి,
మహా నాయకుడూ!

*బాడుగ బ్రతుకులు*

ఆశల్ని
ఆశయాల్ని
కుదువపెట్టి
తెచ్చుకున్నాం
బ్రతుకు భారాన్ని
మోసేందుకు
ఉద్యోగపు ప్రూలీ!
ఆత్మల్ని
అమ్ముకొని
అద్దెకు
తెచ్చుకున్న
మనస్సులతో
బ్రతుకు బండిని
లాగుతున్న
బడుగు వాళ్ళం!
బాడుగ బ్రతుకువాళ్లం

వై. వి. ఎస్. ఎన్. మూర్తి

కథానిక

# అబల

భరణి

దూరాన చర్చ్ గడియారం ఎనిమిది కొట్టింది. వంట పూర్తి చేసుకొని రాధ గుమ్మం ముందు నిలుచుంది. సుదర్శనం యింకా యింటికి రాలేదు. ఆఫీసు వొదిలేది ఐదు గంటలకే అయినా, అతడు యింటికి చేరేది మటుకు రాత్రి పది దాటిన తర్వాతే!

తను వొచ్చిన కొత్తలో ఆఫీసు నుంచి నేరుగా యింటికి వచ్చేసేవాడు. రోజూ తనకు పువ్వుల పొట్లం తీసుకొచ్చేవాడు. తన మీద అతని కున్న ప్రేమనూ, అనురాగాన్నీ తలచుకుని తన అదృష్టానికి మురిసిపోయేది. తన గత జీవితవు లోతుపాతుల్ని మర్చిపోతుండేది.

అయితే—

ఇప్పుడతను పూర్తిగా మారిపోయాడు. తనతో మాట్లాడాలంటేనే అతనికి అసహ్యంగా వుంటోంది. తను దగ్గరికి వెడితే చీడపురుగును చూసినట్టు చూస్తాడు. తను చేసిన తప్పేమిటో తెలియదు—చెప్ప కూడదూ!

రెండు నెలల నుంచీ యమయాతన అనుభవిస్తోంది. అతనితో మున్ముందు తన జీవితం ఎలావుండబోతుందో తలచుకోటానికే భయం వేస్తుంది.

తన మీద అంత యిష్టం లేనివాడు తన నెందుకు లేవదీసుకు రావాలి? పండంటి కాపురాన్ని, నడి వీధిలో వొదిలి తనేదో బావుకునేట్టు యితనితో లేచి వచ్చేసింది.

తన భర్త—చాల మంచివాడు, అమాయకుడు, తనంటే ఆయనకు ప్రాణం, ప్రతి నెలా జీతమంతా తనకేయిచ్చి ఖర్చు పెట్టమనేవాడు.

ఏ పని చేసినా ముందు సలహా అడిగి కాని చేసేవాడు కాదు. కోపమనేది ఎప్పుడూ ఎరగడు—సదా నవ్వుతూ వుండేవాడు.

సుదర్శనం వ్యక్తిత్వమే వేరు. అతను మొదటినుంచీ తనమీద అధికారమే చెలాయిస్తూ వచ్చాడు. మొట్టమొదటిసారి తనను బలవంతంగానే తన కౌగిట్లోకి చేర్చుకున్నాడు. ఇక్కడికి లేవదీసుక రావటం కూడ బలవంతంగానే - ఎన్నోరకాల ఆశలు రేపి మభ్యపెట్టి యిక్కడికి తీసుకొచ్చాడు.

అతనిలో ఏదో ఒక వింతశక్తి, ఆకర్షణ వున్నాయి, ఇదమిత్థంగా ఫలానా అని తను నిర్వచించలేదు. అతను చేతులు చాచినప్పుడు, తను మంత్రం వేసినట్టు అన్నీ మర్చిపోయి అతని కౌగిట్లో లీనమైపోతుంది.

ఎన్నోసార్లు అనుకునేది—"ఈ సారి అతన్ని నా దగ్గరకు రానివ్వను—రానివ్వ కూడదు" అని. కాని, తను అబల!

మొదట తను నిరాకరించినా. చివరికి అతనిదే గెలుపు. అధికారయుతంగానే తనను ఆక్రమించేవాడు. ఓటమిని మౌనంగా అంగీకరించవలసి వచ్చేది.

"చంద మామ రావే—జాబిల్లి రావే" రాధ ఉలిక్కిపడి వీధిలోకి చూసింది. ఎదురింటి వసంత కొడుకును ఎత్తుకుని చంద మామను చూపిస్తూ అన్నం తినిపిస్తూంది.

అప్రయత్నంగా రాధ కళ్లు చెమ్మగిల్లాయి. తను యిద్దరు పిల్లల తల్లి. ఇద్దరినీ వొదిలేసి యితనితో వొచ్చేసింది. తనది ఎంత రాతి గుండె! వాళ్ళు పాపం తల్లిలేని బిడ్డలుగానే పెరుగుతారు. తను మళ్ళా, భర్త దగ్గరికి వెళ్ళిపోతేనో,—పోవచ్చు. ఆయన చాల మంచివాడు. తనను ఏనాడో క్షమించారు. తను సుదర్శనంతో వొచ్చేశాక, ఆయనకు అడ్రసు ఎట్లా తెలిసిందో ఒకసారి జాబు రాశారు.

ఆ జాబు చదివిన తర్వాత కూడ తన మనసు ఎందుకు కరగలేదో యిప్పటికీ ఆశ్చర్యంగానే వుంది. రాధ లోపలకు వెళ్ళి, పెట్టె

అడుగున దాచిన ఉత్తరం తీసింది, దీపం ముందు దాన్ని మనసులో చదువుకుంది—

ప్రియమైన రాధా!

నేను నీకేం ద్రోహం చేశాను చెప్పు? నన్నూ, నా బిడ్డల్నీ యిట్లా ఒంటరిగా ఒదిలేసి వెళ్ళటం న్యాయమా? ఏనాడైనా నేను నిన్ను పల్లెత్తు మాట అన్నావా? చెయ్యెత్తి కొట్టానా? ఏమిటి నేను చేసిన తప్పు?

పోనివ్వు—నా విషయం వదిలెయ్. పాపల సంగతేమిటి? వాళ్ళు నీకోసం ఎంతగా ఏడుస్తున్నారో తెలుసా! 'మాతృ హృదయం' అంటారే స్త్రీది. ఆ మాతృ ప్రేమ నీలో ఏమైంది? నువ్వెక్కడవున్నా సుఖంగా వుండటమే నేను కోరేది. నీకు అక్కడే సౌఖ్యం లభించగలదన్న ఆశవుంటే అక్కడే వుండు. అయితే, నువ్వు మళ్ళా యిక్కడకు రానివ్వ నేమోనని సంకోచించనక్కరలేదు. నీకోసం నా యింటి తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటాయి, ఉంటాను. సదా నీ క్షేమం కోరుతూ— నీ భర్త శివం.

రాధకు ఏడవాలనిపించింది యిప్పుడు. ఒకప్పుడు యిదే ఉత్తరాన్ని అవహేళనగా చదివేసి పెట్టె అడుగున పారేసింది.

శివం మనసు పాలరాయి వంటిది. అతనికీ, సుదర్శనానికీ పోలిక ఎక్కడ! తన భర్త అమాయకత్వానికీ నిష్కల్మష హృదయానికీ జాలి పడింది.

తను మళ్ళా ఆయన దగ్గరకు వెళ్ళిపోతే— దైవం వంటి భర్త. ముద్దు వచ్చే యిద్దరు పిల్లలు. తనకు అంతకంటే ఏం కావాలి? ఈ నరకం కోరి తెచ్చుకున్నది. సుదర్శనం తనను కాకపోతే మరొక స్త్రీని ప్రేమించగలడు. కాని తన భర్తకు తనొక్కతే భార్య! ఆయన తనను తప్ప ఎవ్వరినీ ప్రేమించలేడు.

పేలవంగా నవ్వుతుంది. ఉత్తరం పెట్లో పడేసి గుమ్మం ముందు నిలుచున్నది సుదర్శనం వస్తాడేమోనని.

వీధిలో జనసమ్మర్ధం బాగా తగ్గిపోయింది. చర్చిలో తొమ్మిది కొట్టింది గడియారం. సుదర్శనం రాలేదు. నిట్టూరుస్తూ తలుపు జారవేసి, మంచం మీద పడుకుని ఆటూ యిటూ దొర్లసాగింది.

ఎప్పుడు వచ్చాడో సుదర్శనం వస్తూనే పెద్దగా కేకలు పెట్టసాగాడు: "ఇది సత్రం గాని కొంప గాదు. దొంగలొచ్చి దోచుకు పోయినా దొరసాని మాత్రం కుంభకర్ణుడి చెల్లెలిలా నిద్రపోతూనే వుంటుంది."

మగత నిద్రలోవున్న రాధ యీ మాటలు విని ఉలిక్కిపడి లేచింది.

"ఎప్పుడు వచ్చారు?" అంది లేస్తూ.

"ఎప్పుడు వస్తే ఏం? అసలు నేననేవాణ్ణి ఉన్నాననే మర్చిపోయావు. హాయిగా కడుపు నిండా తిని నిద్రపోతున్నావు. ఇంట్లో సామానంతా దొంగలు దోచుకు పోతారు. నీకేం— నీ సొమ్మయితే గదూ"—

రాధ గుండెల్లో ఆ మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి.

"అట్లాంటి మాట లనకండి" అంది బాధగా.

"ఇంకెట్లాంటి మాట లనమన్నావు? కట్టుకున్న మొగుణ్ణీ, కన్న పిల్లల్నీ ఒదిలేసి ఊరు మీద పడ్డదానికి మాటల విలువ కూడ తెలుసన్నమాట. సిగ్గులేదూ, మాట్లాడటానికి? తలుపులు బార్లా తీసుకుని, గుమ్మం ఎదురుగా మంచం మీద వెల్లకిలా పడుకుంటే, దారిన పోయే నలుగురూ చూస్తారన్న విచక్షణ జ్ఞానం కూడ లేదు నీకు."

"మన యింట్లో మనం పడుకోవటమూ తప్పేనా?" రాధకు తను చేసిన తప్పేమిటో అర్థం కాలేదు.

"మన యిల్లని బట్టలు విప్పుకు తిరగలేక

పోయావ్? సిగ్గులేకపోతే సరి.''

రాధకు పెద్ద పెట్టున ఏడవా లనిపించింది. "నేను యిక యిక్కడ ఒక్క క్షణం కూడ వుండను. వెళ్ళిపోతాను'' అని చెప్పాలనుకుంది.

కాని - నోటి వెంట మాట రాలేదు. చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్వసాగింది. సుదర్శనం బట్టలు విప్పి, లుంగీ కట్టుకు కున్నాడు. ''కూడు పెట్టదలచుకున్నావా లేదా?'' అన్నాడు.

రాధ నిశ్శబ్దంగా లేచి అన్నం వడ్డించింది. సుదర్శనం మాట్లాడకుండా తింటున్నాడు. రాధ అనుక్షణమూ భయపడుతూ అక్కడే కూర్చుంది, అతని భోజనం ముగిసే వరకు.

''నువ్వు తిన్నావా?'' మాట వరసకి అడిగి నట్టు అడిగాడు,

"లేదు'' అంది మెల్లగా.

అబద్ధం అనుకున్నాడు. ''ఎందుకుతినలే?''

''మీరు తినాలి గదా?''

''మహా అభిమానం వున్నట్టు___''

రాధ స్వాభిమానం దెబ్బతిన్నది.

''ఎందుకు నన్నిట్లా సూటీపోటీ మాటలతో బాధ పెడ్తారు. నే నేం తప్పుచేశానో చెప్పగూడదూ?'' అంటూ ఏడ్చింది పెద్దగానే చేతులతో మొహం కప్పుకుని.

సుదర్శనం అన్నం సగంలో వదిలేసి వెళ్ళి చెయ్యి కడుక్కున్నాడు.

రాధ బ్రతిమాల లేదు. కళ్ళు తుడుచుకుని, రెండు మెతుకులు గతికింది, అవి కూడ సహించలా.

వంటింట్లో లైటార్పి, ముందు గదిలోకి వెళ్ళింది. సుదర్శనం మంచం మీద పడుకుని నిద్ర పోతున్నాడు.

మౌనంగా లైటార్పి, నేలమీద చీర కప్పుకుని పడుకుంది తన కుక్కబ్రతుకును తలచుకుంటూ, ఎప్పుడు నిద్ర వచ్చిందో తెలియనే లేదు రాధకు.

రాత్రి ఎప్పుడో - ఇనుప చువ్వల్లాంటి రెండు చేతులు తనని పెనవేసుకోవటం ఆమెకు వూహామాత్రంగా తెలుసు. వాటిని దూరంగా తోసివేయాలని, తను లొంగిపోకూడదని అనుకుంది ఆమె.

కాని ఆమె అశక్తురాలు-అబల. అందుకే ఆ రెండు చేతులూ ఆమెను మరింత దగ్గరగా లాక్కోగలిగాయి.

## విమర్శకులకు క్రిషన్‌చందర్ సమాధానం

- ''నన్ను విమర్శించే రెండు రకాల వారి విమర్శల్లో కూడా (క్రిషన్ చందర్‌ను కొందరు కేవలం ప్రచారకుడు అంటారు; ఆయన రచనలు ప్రచార కరపత్రాలు అంటారు. మరికొందరు ఆయన వట్టి కాల్పనికుడంటారు__సం.) కొంత కొంత సత్యం వుంది. నా రచనా వ్యాసంగం సామాజిక పరిసరాలనే పట్టకంగుండా పయనించి సాహిత్య రూపంలో ప్రతిఫలిస్తుంది. కళా సాహిత్యాలకు ఎలాంటి సామాజిక సంబంధం వుండ రాదనే వారు దాన్ని ప్రచారం అని నిందిస్తారు. కాగా, జీవితమనే యింద్ర ధనస్సు రంగుల్ని చూచి భీతిల్లేవారు, యింద్ర ధనస్సులో ఎరుపు, నీలం, పసుపు రంగుల్లో ఏదో ఒక్కటి మాత్రమే వుండాలని కోరేవారు నేను కాల్పనికుణ్ణని విమర్శిస్తారు.''

# ఏది అసలు - ఏది నకలు?

## మన సినిమాల తీరుతెన్నులు

మన తెలుగు సినీ ప్రముఖులు తెలుగు సినీమాలను విషయ ప్రాధాన్యాన్ని బట్టి పౌరాణికమనీ, సాంఘికమనీ, ఫోక్‌లోర్ అనీ, క్రైమ్ అనీ—యిలా పలు రకాలుగా విభజించారు సినీ వణిక్ ప్రముఖులు, తమ పరిభాషలో ఏభై రోజుల చిత్రాలనీ, నాలుగు వారాల చిత్రాలనీ, నూర్రోజుల చిత్రాలనీ—యిలా చిత్రకాల జీవిత ప్రమాణాన్ని బట్టి.

లోకంలో ఏ వస్తువైనా మంచిదీ చెడ్డదీ కూడా లభిస్తుంది కాని, తెలుగు సినీమా అనేది ఒకేరకం పదార్థం కాబట్టి, గుణ విభజన చేయడానికి వీలులేదు కాబట్టి మంచి చిత్రాలు, చెడ్డ చిత్రాలు అని ఎవరూ విభజించక పోవడం వారి విజ్ఞత.

జూదంలో గెలుపుకీ ఓటమికీ రెండే ప్రధాన కారణాలు—అదృష్టం, దురదృష్టం. తెలుగు చిత్రాలు నూర్రోజు లాడటానికి మూడ్రోజు లాడడానికీ కూడా సినీ పండితుల దృష్టిలో అవే ప్రధాన కారణాలు. పెద్ద చేప చిన్న చేపల్ని మింగేసినట్టు, ఒక నూర్రోజుల చిత్రం తక్కిన వాటిని మూడ్రోజులకల్లా మింగేయగలదు. అదృష్ట జాతకి అయిన ఒక నూర్రోజుల చిత్రాన్ని చూసి (ఇంతకీ తెలుగు సినీమా పుంలింగమా? స్త్రీలింగమా?) అదే మూసలో తయారైన మరొక చిత్రం, మూడ్రోజులకల్లా అంత్యక్రియలు జరిపించుకుంటుంది!

సాహిత్య రచనల్లో స్వంత రచనలు, అనువాద రచనలు, అనుకరణలు అంటూ విభజన వుంది. కాని మన తెలుగు చిత్రాలకు అటువంటి విభజన లేదు. కాని డబ్బింగు చిత్రాలనీ (అనువాదాలు), ఒరిజినల్ చిత్రాలనీ (అంటే అనుకరణలు)—ఏదో ఒక విభజన వుంది. ఒరిజినల్ అనడంలో కొంత సబబు వుంది. ఎందుకంటే యీ చిత్రాలు స్వేచ్ఛానుకరణలు, మూలచిత్రం ఏభై రోజు లాడితే, దాని అనుకరణ నూర్రోజు లాడినప్పుడు ఇది ఒరిజినల్ చిత్ర మవుతుంది—మరి మూల చిత్ర మేమవుతుందో తెలీదు.

ఒక బెంగాలీ చిత్రంలో (దాని పేరు తథాపి), ఒక హిందీ చిత్రంలోనూ (పేరు మరచిపోయాను—క్షంతవ్యుణ్ణి), ఒక జపానీస్ చిత్రంలోనూ యీ వ్యాఖ్యాత చూడని యింకో చిత్రంలోనూ కథానాయకి మూగపడచు కావడం, అదే సబ్జక్టు తెలుగులో తియ్యడం, నూర్రోజులు బట్టి ఆడుతూ వుండడం చూస్తే, మనవే ఒరిజినల్ చిత్రాలని చెప్పుకోవాలి. అంతే కాదు పైన పేర్కొన్న చిత్రాలలో పాటలు లేవు, నృత్యాలు లేవు, పిస్తోళ్ళు, కత్తులు మొదలైన ఆయుధాలతో కథానాయకిని నానా యిబ్బందులూ పెట్టే విలన్స్ లేరు, పోలీసులు లేరు. (మన తెలుగు చిత్రాలు చాలవాటిలో సమస్యలను పోలీసులే పరిష్కరిస్తారు). కాబట్టి యివన్నీ వుండి, ప్రజాదరణ పొందిన మన చిత్రమే ఒరిజినల్ చిత్రం!

సంస్కృతం నుండి మహాభారతాన్ని తెలుగులోకి కవిత్రయం అనువదించినా, తెలుగు భారతం ఒరిజినల్ గ్రంథం. మన నూర్రోజుల చిత్రాలు కూడా అంతే. ఒక బెంగాలీ చిత్రాన్నో, మరాఠీ చిత్రాన్నో కాని హిందీలో తీస్తారు. అది కాని తెలుగులో తీస్తారు. తరవాత తమిళంలో తీస్తారు. ఈ చిత్ర విజయాన్ని చూసి దీనిని హిందీ వారు కొని వాళ్ళు హిందీలో తీస్తారు. అంటే వారి చిత్రమే (వారిది కాదనుకోండి) మళ్ళీ వాళ్ళు కొనుక్కుంటారు. కాబట్టి ఏది అసలు చిత్రం, ఏది అనుకరణ చిత్రం అని ఎవరూ అడగలేరు. ఆల్ ఒరిజినల్స్—నో డూప్లికేట్స్.

కథానిక

# చల్ల పెంకులు

కృష్ణానంద కుమార్

సరిగ్గా పదిహేను దినాలయింది నారాయడు స్కూలుకు వచ్చి. ఏమయిందో తెలుసు కుందామని బయలుదేరాను. పట్టుదలతో చదివే చురుకైన కుర్రవాడు నారాయడు. పది రోజులలో పెద్ద పరీక్షలు మొదలవ్వబోతూంటే వాడిలా బడికి రాకపోవడం తలుచుకుంటే నా మనసు పరిపరి విధాల పోయింది. పగటి వెలుగును చెదరగొట్టే నల్లటి చీకట్లు నలు వేపుల నుంచీ ముసురుకుంటున్నాయి. దుర దృష్ట జాతకుల బతుకుల్లా ఆకాశం వెలుగు బట్ట వదలి వెలవెల బోతూంది.

వాడేదైనా జబ్బున పడ్డాడేమో! ఒకవేళ చాలాకాలంగా మంచాన పడివున్న వాళ్ళమ్మ "హరీ" అనలేదు గదా? మరేవైనా అవాంత రాలు వచ్చాయేమో! అన్నీ ప్రశ్నలే. వాణ్ణి కలుసుకొంటే గానీ సమాధానాలు తెలియవు.

ఓ పూట తింటే మరో పూట పస్తుండే అస్తుబిస్తు కుటుంబం. వాడీ లోకంలో పడి కళ్ళు తెరువగానే, వాడి తండ్రి కళ్ళుమూసి మరో లోకానికి వెళ్ళిపోయాడు. నాలుగేళ్ళ క్రితం పక్షవాతంతో మంచ మెక్కిన వాడి తల్లి మరి మంచం దిగనేలేదు. పదహారేళ్ళు నిండని వాడి అక్క సంపాదించే నాలుగు రాళ్ళతో కాలాన్ని వెళ్ళదీస్తున్నారు వాళ్ళు. అలాంటి పరిస్థితుల్లో పెరిగిన నారాయడు స్నేహితుల పుస్తకాలు అరువు తీసుకొని చదువుకుంటూ ప్రతి క్లాసూ ఫస్టుగా పాసవడం వింతే మరి. చదువుమీద వాడికున్న శ్రద్ధ చూస్తే ఆశ్చర్య మేస్తుంది.

నేను స్కూల్లో చేరిన మొదటి రోజు అటెండెన్సువేస్తూ "నారాయణ" అని పిలిస్తే "ప్రెజెంట్ సార్" అని క్లాస్ ద్వారం దగ్గర చూశాను. ఓ చేత్తో చెడ్డీని పైకి లాక్కుంటూ మరో చేత్తో పుస్తకాల సంచిని భుజంపై కెగ దోసుకుంటూ న్నప్పుడు, ఆ కోలమొహంలో విడిన పెద్దరేకుల్లా కళ్ళూ, కొండవాగుల్లా వంకీలు తిరిగిన జుత్తూ, అమాయకమైన ఆ రూపం చూస్తే, ఒక్కసారిగా నా ఒళ్ళు జలదరించింది. మనస్సు కల్లోల మయింది. వాడు సరిగా మా సాయిని గుర్తుకు తెచ్చాడు. మా సాయి గూడా అచ్చు అల్లాగే వుండే వాడు.

ఆ రోజులలో నా వుద్యోగం పోయింది. గిరిజ ఒంటి మీద నగలు ఒక్కొక్కటీ, మంగళ సూత్రంతో సహా మాయమైనాయి. చివరకు మిగిలిన మా ఆఖరు ఆస్తి, ఆదే నా ఒక్కగా నొక్క కొడుకు సాయి చేత చిల్లి గవ్వ లేని స్థితిలో సరైన మందూ మాకూ లేక న్యుమోనియాతో కన్నుమూశాడు.

స్పష్టమైన ఉచ్చారణతో, భావయుక్తంగా నారాయడు పద్యం చదువుతుంటే, ఐదేళ్ళ మా సాయి కృష్ణశతకంలోని పద్యాలు పొల్లు పోకుండా అప్పచెప్పడం స్ఫురణకు వచ్చేది.

వాడి తెలివి తేటలకు పదును పెడితే భవిష్యత్తులో యెంతో పైకి వస్తాడు. అందుకు నేను చేయగలిగిందంతా చేయాలి. ఒకనాడు సాయిని గురించి నేను కన్న కలల్లో కొన్నైనా నారాయడి విషయంలో జరిగితే అంతకన్నా నాకింకేం కావాలి?

నారాయడిపై అలా ఆశలు పెంచుకొన్న నాకు వాడు గత పదిహేను రోజులు బడికి రాకుండా, కనీసం తనకొచ్చిన కష్టమేమిటో నాకు కూడా చెప్పకుండా యిలా యెందుకు చేశాడూ! ఏమైనా వాడిని యీ రోజు కలుసు కోవలసిందే.

"కార్పొరేషన్ కాలనీ" అన్న కండక్టర్ కేకతో యీ లోకంలోకి వచ్చిన నేను అడ్డుగా

నా ముందున్న నలుగురిని నెట్టుకుంటూ బస్సు దిగేశాను. వీధి దీపాల గుడ్డి వెలుతురు నా మనస్సులోని ఆందోళనలా అస్పష్టంగా వుంది. అడుగులు జాగ్రత్తగా వేస్తూ తడబడకుండా నడుస్తున్నాను. రోడ్డుకు వారగా రెండడుగుల లోతుగా, ఓ గోతిలో వుండే కొళాయి, దాని చుట్టూ దాదాపు ముప్పై నలభై కుండలూ వున్నాయి. సహజంగా అన్ని కొళాయిల దగ్గర జరిగేట్లుగానే అక్కడా ఓ చిన్న సైజు యుద్ధం జరిగింది కాబోలు, రోడ్డంతా చిందర వందరగా పడివున్న కుండ పెంకులు అక్కడి వారి బతుకులకు ప్రతి రూపాలు. కొళాయికి కొద్ది దూరంలోవున్న మురుగ్గుంటలో పోలేక యిమడలేక పందులు కీచులాట.

ఓ యింటి వాకిట్లో చిమ్మచీకట్లో తెల్లని మల్లెచెండు తురుముకున్న ఓ తెల్లచీర నన్ను చూసి తెల్లని పలువరస బయట పెట్టింది. గబ గబ ఆ యింటిని దాటాను. ఓ గుడిసెలో నుండి యెవరిదో యేడుపు. ఎవరో పోయారు కాబోలు. అదే సంపాదించేవాడై తేనో, పాపం ఆ కుటుంబం ఏమవుతుందో! మరో వైపు ఒక మగాడు, ఆడది యెందుకో ఘర్షణ పడుతూ బిగ్గరగా అరుచుకొంటున్నారు. ఉన్నట్లుండి వీధి కుక్కలు గయ్‌మని అరవ సాగాయి.

మరో నాలుగడుగులు వేశాను. కూని రాగం తీస్తూ యెబ్బెట్టుగా వయ్యారా లొలకబోస్తూ పళ్ళికిలిస్తూ నిలుచుకున్న మరో తెల్లచీర వెకిలిగా చూసి చేత్తో సైగ చేసింది. కంకర రోడ్డు పైన నడుస్తున్న నా కాళ్ళకింద యేదో మెత్తగా తగిలింది. పక్కకు జరిగి చూశాను. బాగా నమిలి వుమ్మేసిన చెరకు పిప్పి, ఛః ఛః రాగూడని ప్రాంతానికి వచ్చానేమో అనిపించింది. అయినా నారాయడిని చూడాలి. మరో పదడుగులు వేశానో లేదో యీలవేస్తూన్న చప్పుడు నా వెనుకనే వినవచ్చింది. వెనుదిరిగి చూశాను. ఓ పొడుగు మనిషి పక్క, పూల లుంగీ చుట్టుకొన్న ఒక ఆసామీ నన్ను సమీపించాడు. "పొణ్ణు వేణుమా సార్, కాలేజి గరల్ సార్! ఆయిక్లాస్, సొల్లుంగో సార్'' అన్నాడు. వ్యభిచారు లుండే వీధికి వచ్చానన్నది నా కర్థమైంది. నేను వాడికెలాంటి సమాధానమూ యివ్వకుండా గబ గబ అడుగులేస్తూ ముందు కెళ్ళాను.

ఆ ప్రాంతం మరీ చీకటి గుయ్యారంలా వుంది. 'ఏవో ఆకారాలు తిరుగుతున్నట్లు కనిపిస్తున్నాయి చుట్టూ గుడిసెలు. బురదా, చెత్తా చెదారాలతో నిండిన ఆ రోడ్డూ అంతకు మించి ఆ చీకట్లోనే అటూ యిటూ తచ్చాడుతూన్న బురద బ్రతుకులు చూస్తుంటే మరి కాళ్ళు ముందుకు సాగలేదు.

ఇక లాభం లేదని వెనుదిరిగి గబగబ నడుస్తున్నాను. చెదరిన చిల్లపెంకులను దాటి, కొళాయిని దాటి ముందుకు వెళ్తున్నాను. మళ్ళీ యీల వెన్నంటే వస్తూంది. మరింత దగ్గరగా, బిగ్గరగా వినవస్తూంది. మెయిన్ రోడ్డు చేరుకొన్నాను. అక్కడ మెర్క్యూరీ కాంతులు తెల్లగా రోడ్డంతా పరుచుకున్నాయి.

''సార్! మంచి అమ్మాయి సార్! ఏ క్లాస్ గర్ల్ కావాలా సార్!'' స్వచ్ఛంగా పలుకుతున్న ఆ ఉచ్చారణ విని తృళ్ళిపడ్డాను. ఒక్కసారి వెనుదిరిగి చూశాను, అంతే! నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. వాడే....నా సాయికి మారు రూపంగా వూహించుకున్న నారాయణ....విద్యావంతుడై ఒక మనిషిగా పైకెక్కి రాగలడని నేను యెన్నో ఆశలు పెట్టుకున్న నారాయణ....నా శక్తి సామర్థ్యాల మేరకు పైకి తీసుకు రాగలనని యెన్నో కలలుకన్న నారాయణ....నన్ను చూడగానే హడలిపోయాడు, తెల్లటి మెర్క్యూరీ దీపకాంతుల నుండి పరుగెత్తి ఆ చిమ్మచీకటులలో అంతర్థానమై పోయాడు.

# తెలుగు నవలలో జాతీయోద్యమ చిత్రణ

**చర్చా వేదిక**

**1920** నుండి 1940 వరకూ రెండు దశాబ్దాలపాటు మన దేశంలో అది వరకు వేళ్ళు నాటుకున్న భూస్వామ్య ఛాందస స్వభావాలను, ఆచారాలనూ ప్రశ్నించి, నూతన భావాలకు నాందీ వాచకం పలికిన భారత స్వాతంత్ర్యోద్యమం కొన్ని తెలుగు నవలలలో చిత్రించబడిన తీరు సాహితీపరులు అధ్యయనం చేయవలసి వుంది. ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ 3-7-77 చర్చా గోష్టిని నిర్వహించింది. శ్రీ సెట్టి ఈశ్వర రావు అధ్యక్షతన జరిగిన యీ గోష్టిలో టి. ఎల్. నరసింహారావు, పి. సూర్యమోహన్, మహీధర రామమోహనరావు, శ్రీకాంత్ గార్లు రచయితలు స్వాతంత్ర్యోద్యమాన్ని చిత్రించిన కొన్ని తెలుగు నవలలపై ప్రసంగ వ్యాసాలు చదివారు.

శ్రీ మహీధర రామమోహనరావు తాను వ్రాసిన "*కొల్లాయి గట్టితేనేమి?*" అనే నవలలో, తెలుగు దేశంలో స్వాతంత్ర్య పోరాటం ఎలా విస్తరించిందో, ఆ విస్తరణకు తోడ్పడిన భౌతిక, సాంస్కృతిక పరిస్థితులు ఎట్టివో చిత్రించడం తన ప్రధానోద్దేశమని చెప్పేరు. "భిన్న భిన్న దృక్కోణాల వ్యక్తులు జాతీయోద్యమం చేబట్టిన కొన్ని కొన్ని కార్యక్రమాలను హర్షించలేక పోయినా, ఆ వుద్యమానికి తమ చేతనైన సహాయం చేశారు, తమ ఆమోదం తెల్పేరు. ఈనాడు కాంగ్రెసులో విస్తృతరూపంలో కనిపించే కొన్ని అవాంఛనీయ ధోరణులకు చారిత్రకంగా వున్న ప్రాతిపదికలను చూపడం, జాతీయోద్యమం అభివృద్ధి పొందే క్రమంలో, మన దేశంలో వున్న ప్రత్యేక పరిస్థితులలో ఆ ధోరణులు అతి సహజంగానే ఏవిధంగా రూపొందేయో చూపడం యీ నవలలో వుంది" అన్నారాయన.

ఇదే నవలను గురించి శ్రీ పి. సూర్యమోహన్ ప్రసంగిస్తూ, "జాతీయోద్యమాన్ని చిత్రించిన *కొల్లాయి గట్టితేనేమి* నవలకు తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం వుందన్నారు. "ఆనాటి దేశ రాజకీయ పరిస్థితుల్ని చక్కగా వివరిస్తూ, అదే సమయంలో కథ బిగువు సడలకుండా రచన సాగించిన రచయిత అభినందనీయులు" అన్నారు.

శ్రీ శ్రీకాంత్, అడివి బాపిరాజు గారు వ్రాసిన *నారాయణ రావు* నవలను గురించి తన ప్రసంగ వ్యాసం చదివారు. ఆనాడు కాంగ్రెస్ సంస్థ వివిధ వర్గాల కలగూర గంప అనీ, అందులోని ఏ వర్గమూ తన ప్రయోజనాలను బలి పెట్టడానికి ఇష్టపడలేదనీ, ఈ నవలలో కొన్ని పాత్రలు స్పష్టం చేస్తున్నాయన్నారు. స్వాతంత్ర్య పోరాటం, జమీందారీ విధానం రద్దు, సాంఘిక సంస్కరణాభిలాష యీ నవలలో ఉన్నాయి. పాత్రల చర్చలలో మాత్రమే జాతీయోద్యమ ప్రస్తావన వస్తుంది తప్ప, కథలో అంతర్భాగంగా ప్రస్తావించబడలేదు. అందువల్ల పాఠకుడు ఈచర్చలలో తాదాత్మ్యం చెందకపోగా, నవలకు హీరో అయిన నారాయణ రావు ఆదర్శవాదపూరితమైన మనో దౌర్బల్యంగల వ్యక్తిగా మనకు గోచరిస్తాడు. ఏది ఏమైనా 1920–30 మధ్యకాలంలోని జాతీయోద్యమ పోరాటాన్ని, సామాజిక పరిస్థితినీ ప్రగతిశీల దృక్పథంతో చిత్రించిన ఉత్తమ నవల యిదన్నారు శ్రీకాంత్.

శ్రీ టి. ఎల్. నరసింహారావు, మాలపల్లి నవల గురించి చదివిన ప్రసంగ వ్యాసంలో, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ జాతీయోద్యమానికి ఒక కొత్త దృక్పథం కల్పించాలనే లక్ష్యంతో యీ రచన చేశారని చెప్పేరు. (చూ. పుట 8).

తరవాత జరిగిన గోష్టిలో శ్రీ డి. వి. నరసరాజు ప్రసంగిస్తూ, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణకు సనాతన ధర్మంలో నమ్మకం వున్నదనీ, అందుకనే మాలపల్లి నవలలో రామదాసు ఆయనకు అభిమాన పాత్రలలో ఒకటయిందనీ అన్నారు.

శ్రీ ఉప్పల లక్ష్మణరావు రచించిన అతడు-ఆమె నవలను గురించి ప్రస్తావిస్తూ, జాతీయోద్యమం మీద ఆనాడు ఆయన చేసిన విమర్శలు, వ్యాఖ్యానాలు నేటికీ కాలదోషం పట్టలేదనీ, అవి యిప్పటికీ వర్తిస్తాయనీ శ్రీ లంకా సూర్యనారాయణ అన్నారు.

తెలుగు జాతీయోద్యమం గురించీ, అందులో పాల్గొన్న వ్యక్తులను చిత్రించే పాత్రలతో కూడిన నవలలు వచ్చాయి, కాని జాతీయోద్యమం జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేసిందో చిత్రించిన నవలలు రాలేదని శ్రీ చామర్తి దుర్గాప్రసాద్ అన్నారు.

సమావేశం ప్రారంభంలో, విశాలాంధ్ర ప్రచురణాలయం యిటీవల నిర్వహించిన నవలల పోటీలో, మద్రాసు శాఖ కార్యదర్శి శ్రీకాంత్ నవల "దేవుళ్లారా మీ పేరేమిటి?"కి ప్రథమ బహుమతి వచ్చిన సందర్భంగా ఆయనను యీ సమావేశం అభినందించింది.

## లేఖలు

### 'మృచ్ఛకటికం' విప్లవాత్మకత

'అభ్యుదయ'లో (జూన్ సంచిక) పడిన 'మృచ్ఛకటికం' సమీక్ష ఆ మహత్తర నాటకానికి తగ్గట్టుగా లేదు, అసమగ్రంగా వుంది.

వెయ్యి - రెండు వేల సంవత్సరాల మధ్య కాలంలో ఎప్పుడో, రాజు దేవుడితో సమానమన్న మూఢాభిప్రాయం ప్రజల మనస్సులలో నాటుకొనిపోయివున్న పరిస్థితులలో దుష్పరిపాలనపైని తిరుగుబాటు జరిపి, ప్రజలు సత్పరిపాలనను స్థాపించుకోవడం యితివృత్తంగా వున్న విప్లవాత్మకమైన నాటక మిది. ఇంకో వింత, రాచరికాన్ని కూలదోసిన యితివృత్తంతో రాసిన యీ నాటకానికి కర్త, ఆ కాలపు రాజు! నాయిక వేశ్య, పతివ్రత! ఆమె భర్త, బ్రాహ్మణుడు! ఈ కాలంలోనూ అపురూపం అనిపించే యిటువంటి విప్లవాత్మక ఘటన లుండడమే కాకుండా, ఒకటిన్నర సహస్రాబ్దాల క్రితపు సమాజిక పరిస్థితులకు 'మృచ్ఛకటికం' దర్పణంగా వుంది (వాటిలో కొన్నిటిని 'అభ్యుదయ'లో వివరించారు.)

'అభ్యుదయ' మొదట్నుండీ తెలుగు సాహిత్యంలోని ఉత్కృష్ట రచనలను పరిచయం చేయడం కర్తవ్యంగా పెట్టుకున్నది. 'మృచ్ఛకటికం' సంస్కృత రచన అయినా, మరీ పాత కాలపుదే అయినా, గొప్ప విప్లవాత్మక భావన యితివృత్తంగా వున్నది కావడంవల్ల, 'అభ్యుదయ' దానిని విపులంగా సమీక్షించడం సముచితంగా వుంటుంది.

ఈ దేశంలో మేఘ సందేశం, శాకుంతలం, భాస నాటకాలు వంటి ప్రాచీన సంస్కృత కావ్యాలకున్న ప్రశస్తి. మృచ్ఛకటికానికి లేకపోవడం శోచనీయం. మేఘ సందేశాదులు ఎంత రమణీయమైన వైనప్పటికీ, దీనికి వున్నటువంటి సాంఘికాభ్యుదయకరమైన యితివృత్తం వాటికి లేదు కదా.

కె. మృత్యుంజయ శాస్త్రి, విశాఖపట్టణం

ఆగస్టు 7 (ఆదివారం) సభ :

**కవితా పఠనం**

స్థలం: పొట్టి శ్రీరాములు స్మారక మందిరం
ప్రారంభం: సాయంత్రం 6 గంటలకు
అందరికీ స్వాగతం

# సాహితీ ప్రతిభా సంపన్నుల ఉత్తమ సాహిత్యం

### కిషన్‌చందర్ నవలలు

| | రేటు |
|---|---|
| జంగ్లీ ... | 9.00 |
| దాదర్‌వంతెన పిల్లలు ... | 6.00 |
| నేపాల్‌లో గాడిద ... | 3.50 |
| అయిదుగురు లోఫర్లు .. | 5.00 |

### రాహుల్జీ రచనలు

| | |
|---|---|
| జయ యౌధేయ | 8.00 |
| సింహ సేనాపతి ... | 9.00 |
| దివోదాసు | 3.50 |
| విస్మృత యాత్రికుడు | 12.00 |
| మధుర స్వప్నం | 10.00 |
| ఋగ్వేద ఆర్యులు .. | 12.00 |

### ప్రేమ్‌చంద్ నవలలు

| | |
|---|---|
| గబన్ | 8.00 |
| ప్రతిజ్ఞ ... | 7.50 |

### విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

నవలల పోటీలో బహుమతులందిన నవలలు

దేవుళ్ళారా మీ పేరేమిటి
(ప్రథమ బహుమతి)
— శ్రీకాంత్ రు. 6.00

కన్నీటికి నోరొచ్చింది
(ద్వితీయ బహుమతి)
— ఎస్. కాశీవిశ్వనాథ్ రు. 6.00

మీరూ మనుషులేనా?
(తృతీయ బహుమతి)
— పరుచూరి రాజారామ్ రు. 6.00

## నవలాతోరణం

| | రేటు |
|---|---|
| అతడు ఆమె [1, 2 భాగాలు అచ్చులో] | |
| అతడు ఆమె [3వ భాగం] ఉప్పల లక్ష్మణ రావు | 7.50 |
| జంగిజ్ ఖాన్ (తెన్నేటి సూరి) .. | 14.00 |
| నీలం నోట్‌బుక్ (కజకేవిచ్) . | 2.50 |
| మృత్యుంజయులు (బొల్లిముంత శివరామకృష్ణ) ... .. | 4.50 |
| ప్రతిద్వంది (సునీల్ గంగూలి) .... | 5.00 |
| లండన్‌లో ఒక రాత్రి (సజ్జాద్ జహీర్) .. .. | 4.50 |
| సుశీల (నిడమర్తి సత్యనారాయణ) | 9.00 |

*విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-4.*

*విశాలాంధ్ర బుక్ హౌస్ :*

*విజయవాడ, హైదరాబాదు, విశాఖపట్నం, అనంతపురం, తిరుపతి, వరంగల్.*

Edited and Published by T. Venkataramiah, at 15, Arulammal Street, Mardas-600017 and Printed at Sri Venkateswara Printers, Madras-600021.